

# సూర్య

నేటి దినపత్రిక
www.suryaa.com
కర్నూలు నంద్యాల
గురువారం | 26 జూన్ 2025
పేజీలు 8

## విద్యాహక్కు చట్టానికి తూట్లు..!




- ఆర్‌టిఈ నిబంధనలు పట్టించుకోని ప్రైవేటు విద్యాసంస్థలు
- లబ్ధిదారులు, విద్యార్థి సంఘాల ఆందోళన
- చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్న విద్యాశాఖ అధికారులు

**కర్నూలు ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్ :** విద్యా హక్కు చట్టానికి ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తూట్లు పొడుస్తున్నాయి. ప్రైవేటు విద్యా సంస్థలు ఆర్‌టిఈ(రైట్ టు ఎడ్యుకేషన్) నిబంధనలు పట్టించుకోకుండ విద్యార్థుల తల్లిదండ్రుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. తాము ఆర్‌టిఈ కింద దరఖాస్తు చేసుకున్నాము తమకు ఫీజు మినహాయింపు ఇవ్వాలని కోరినా యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. దీంతో పేద విద్యార్థుల

మిగతా 2లో

## వైద్య మాఫియాను అడ్డుకునేదెవరు..?

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** సమాజంలో వైద్యులను దేవుళ్లతో సమానంగా ప్రజలు కొనియాడుతారు. నేటి సమాజంలో మాత్రం ప్రజలకు వైద్యసేవ చేస్తామంటూ వైద్య విద్యార్థులుగా ఉన్నప్పుడు అనుకున్న బాసలు, భావాలను మరిచిపోయి వైద్య చదువు పూర్తయిన తర్వాత విలువలను మరుస్తున్నారు. కొందరు వైద్యులు మాత్రం స్వలాభంతో ఆలోచించి చదువుపై పెట్టిన ఖర్చు,ఆసుపత్రి నిర్మించడం కోసం పెట్టిన ఖర్చులను మతిలో పెట్టుకుని వైద్యం చేస్తూ ప్రజలపై అధిక డబ్బులను వసూలు చేస్తున్నారు. ప్రజల ప్రాణాలే ఎరగా పెట్టి వైద్యం పేరుతో పేద ప్రజలను దోపిడీ చేస్తున్నారు.రోగి బంధుమిత్రులు డాక్టర్లను ప్రశ్నిస్తే తమ వాళ్ల ప్రాణాలు ఎక్కడ కోల్పోతామోనన్నే భయంతో వైద్యులను ప్రశ్నించలేక ప్రైవేటు డాక్టర్ ఎంత డబ్బులు నిర్ణయిస్తే అంత డబ్బులు అప్పు తెచ్చి ఆసుపత్రికి చెల్లించి అప్పులలో కూరుకుపోయిన ప్రజలు ఎందరో మనోవేదనకు గురవుతున్నారు. కొన్ని ఆసుపత్రుల్లో అక్రమంగా వైద్య దందా చేస్తున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్నా ఆసుపత్రులలో ఎన్నో ప్రాణాలు కోల్పోయినప్పటికీ ప్రైవేటు ఆసుపత్రులపై ప్రభుత్వ ఉన్నతాధికారులు కట్టుదిట్టమైన కఠిన చర్యలు తీసుకుంటే

మిగతా 2లో

- ఆరోగ్యశ్రీని అబాసుపాలు చేస్తున్న ప్రైవేటు ఆసుపత్రులు
- ప్రజల ప్రాణాలకు దిక్కెవ్వరు..?
- వైద్యులు దేవుళ్ల లాగా ఉండలేరా..?
- అధికారులకు విధుల పట్ల అంకితభావం ఉండాలి..
- జరిగిన తప్పు మరొకసారి జరగకుండా చూసుకునే బాధ్యత ప్రభుత్వ అధికారులది కాదా..?





## ఇలా పాపం.. తలా పిడికెడు..

- మెప్మాలో వసూళ్ల పర్వం..
- పేదల సొమ్ము పంచుకుతింటున్నారు
- అక్రమాలకు వెన్నుదన్నుగా నేతలు

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్:** పేద, మధ్య తరగతి మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాల్సిన పొదుపు సంఘాలలో అవినీతి రాజ్యమేలుతోండి. నిరాక్ష్యరాస్య మహిళలకు సాయం చేసి పొదుపు సంఘాలను నిర్వహించాల్సిన సిఆర్‌పిలు మహిళల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని అక్రమాలకు పాల్పడుతున్నారు. ఓవైపు కమీషన్లు, మరోవైపువాయిదాల సొమ్ము కాజేసి పేద మహిళలను నట్టేట ముంచుతున్నారు.

మిగతా 2లో



పొదుపు మహిళా సంఘం (కార్టూన్)

## ట్రాఫిక్ నియంత్రణకు పకడ్బందీ ఏర్పాట్లు

- కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** ట్రాఫిక్ నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ అన్నారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం అత్యాధునిక టెక్నాలజీతో రూపొందించిన 2-బుల్లెట్,20-అపాచి వాహనాలను జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఎస్పీ విక్రాంత్ పాటిల్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్ర డిజీపి కార్యాలయం

మిగతా 2లో



జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న ఎస్పీ

## తుంగభద్ర @ 50 టీఎంసీలు

**హొళగుంద,మేజర్‌న్యూస్:** కర్ణాటక, ఆంధ్రాప్రదేశ్,తెలంగాణ రాష్ట్రాల రైతన్నలకు సాగునీరు,ప్రజలకు తాగునీటిని అందించే సంయుక్త జీవనాడి అయిన తుంగభద్ర జలాశయంలో కెపాసిటి 100.05 గాను 50.315 టీఎంసీలకు నీటి సామర్థ్యం చేరింది.కర్ణాటక విజయనగర (హోస్పేట్) జిల్లా కేంద్రంలో ఉన్న తుంగభద్ర జలాశయం ఎగువ ప్రాంతాలైన శివమొగ్గ,హగుంబే, చిక్కమంగళూరు,తీర్థహళ్లి,హరిహర ఆరావళి పర్వాతాలలో కురుస్తున్న వర్షాలకు జలాశయానికి 24,115 క్యూసెక్కుల

మిగతా 2లో



తుంగభద్ర జలాశయం

# విద్యాహక్కు చట్టానికి తూట్లు..!

(మొదటి పేజి తరువాయి)

తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. విద్యార్థి సంఘాలు సైతం ఆర్‌టిఐపై ఆయా విద్యాసంస్థలకు వెళ్లి డిమాండ్ చేసినా సరైన స్పందన ఇవ్వడం లేదు. దీంతో విద్యార్థుల తల్లి దండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు విద్యా శాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న పరిస్థితి నెలకొంది.

**ఆర్‌టిఈ ఏం చెబుతుంది.. :** ఆర్‌టిఈ అంటే విద్యా హక్కు చట్టం 2009ప్రకారం ఇందులో 6నుండి 14సం॥లలోపు పిల్లలకు ఉచిత మరియు నిర్బంధ విద్యను అందించాలి. ఈ చట్ట సెక్షన్ 12(1)సి ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఆర్థికంగా బలహీన వర్గాలు, ఈడబ్ల్యుస్, అనాథలు, హెచ్‌ఐవి బాధితులు, దివ్యాంగుల పిల్లల కోసం 25శాతం సీట్లు కేటాయించాలని ఉంది. వీరు నిర్ణీత గడువులోగా ప్రభుత్వ వెబ్‌సైట్ సిఎస్‌ఈ.ఏపి.జీఓవి.ఇన్‌లో దరఖాస్తు చేసుకుని సీట్లు పొందవచ్చు. దీంట్లో లబ్దిదారులకు ప్రభుత్వం ఆయా సీట్లు ఉచితంగా కేటాయిస్తుంది.

కర్నూలు జిల్లాలో మొత్తం 738ప్రైవేటు విద్యాసంస్థలు నిర్వహిస్తున్నారు. ఇందులో పేద విద్యార్థులు విద్యా హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వం నుండి సీటు అలర్ట్ అయినా ఆయా విద్యాసంస్థలు తమ ఫీజు చెల్లించాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు. అర్హులైన విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆయా బడులకు వెళితే వెనక్కి తిప్పి పంపుతున్న సంఘటనలు వున్నాయి. అధికారులు మాత్రం మీకు సీటు కేటాయించాం మా పనైపోయింది అన్నట్లు వ్యవహరించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇంత జరుగుతున్నా విద్యా శాఖ అధికారులు మాత్రం చూసిచూడనట్లుగా వ్యవహించడం శోచనీయం.

**విద్యాసంఘాలు ఆందోళన :** విద్యాహక్కు చట్టంను ప్రభుత్వ నిబంధనల ప్రకారం అమలు చేయాలని ఆయా విద్యార్థి సంఘాలు లబ్దిదారులతో వెళ్లి యాజమాన్యాలను ప్రశ్నించాయి. దీంతో యాజమాన్యం తమకు కోర్టు ఫీజులు తీసుకోవాలని చెప్పిందని, ఫీజు చెల్లించకపోతే తాము విద్య అందించలేమని చెబుతున్న పరిస్థితి ఉంది. దీనిపై డిఈఓ, విద్యా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

# ట్రాఫిక్ నియంత్రణకు పకడ్బందీ చర్యలు

(మొదటి పేజి తరువాయి)



ఎస్పీకి డ్రోన్ కెమెరాలను అందజేస్తున్న డి.వి.ఆర్

మంగళగిరి నుండి వచ్చిన ఈ వాహనాలకు సైరన్, బ్లింకర్స్, పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టం, క్రౌడ్ కంట్రోల్ చేయడానికి అత్యాధునిక టెక్నాలజీతో వాహనాలను రూపొందించారన్నారు. జిల్లాలోని కర్నూలు, ఎమ్మిగనూ రు, ఆదోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లకు ఈ వాహనాలు కేటాయిస్తున్నామన్నారు. విజిబుల్ పోలీసింగ్ పెరగడంతో ప్రజలు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తారని భావిస్తున్నామన్నారు. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడినప్పుడు ఈ వాహనాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం డివిఆర్ గ్రూప్స్ అధినేత డి.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియంత్రణకు తీసుకుం టున్న చర్యలను అభినందిస్తూ డిజె డ్రోన్ కెమెరాను తనవంతు సహాయంగా అందచేసినట్లు తెలిపారు. డివిఆర్ సిటీ డిజిటల్ జనరల్ మేనేజర్ ఎస్‌కె మహేష్ మాట్లాడుతూ కర్నూలు నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ఎస్పీ తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని ఆయన అన్నారు.ప్రతిఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీస్ యంత్రాంగానికి సహకరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేంద్ర, సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ మహేష్ కుమార్, ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణ మోహన్, డిఎస్పీలు బాబు ప్రసాద్, భాస్కర్‌రావు, ప్రసాద్, సిఐలు తేజమూర్తి, మన్సూరుద్దీన్, అబ్దుల్ గౌస్, నాగరాజా రావు, రామానాయుడు ఆర్‌ఐలు నారాయణ, జావేద్, సోమశేఖర్ నాయక్, ట్రాఫిక్ ఆర్ ఎస్ఐ హుస్సేన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా మట్టి ఎద్దుల అమావాస్య

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** మట్టి ఎద్దుల అమవాస్య బుధవారం గోనెగండ్ల మండలంలో రైతులు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మట్టి ఎద్దుల అమవాస్య పర్వదినం సందర్భంగా రైతులు మట్టి ఎద లను తయారు చేసి జోడుఎద్దులను ఇంట్లో కొలువు ఉంచి పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తారు. ఈ పూజలు మండల పరిధిలోని పలు గ్రామాలలో రైతులుబుధవారంఘనంగా జరుపుకున్నారు.సాయంత్రంశివాలయం దగ్గరకు మట్టి ఎద్దుల బొమ్మలను తీసుకువెళ్లి దేవాలయంలో శాస్త్రోతంగా పూజలు నిర్వహిస్తారు. ఈ ఏడాది వర్షాలు కురిసి పంటలు బాగా పండాలి దేవుడా అని పూజలు చేస్తారు. అనంతరం మట్టి ఎద్దులను ఇంటికితీసుకువచ్చి ఇంటిపై కప్పుపై ఏడాదంతా ఉంచుతారు. కొందరు శివాలయంలోనే వదిలి వస్తారు.ఈ పండుగను పల్లెలలోని రైతులుఘనంగా జరుపుకున్నారు.



# వైద్య మాఫియాను అడ్డుకునేదెవరు..?

(మొదటి పేజి తరువాయి)

ప్రజలు అన్యాయానికి గురికారని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.ప్రైవేటుఆసుపత్రి యాజమాన్యాలపై అధికారులు నిర్లక్ష్యం వహించి చర్యలు తీసుకోకపోవడంతో ఇష్టానుసారంగా వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతూ ప్రజలను దోపిడీ చేస్తున్నారు. ఉన్నతాధికారులు ప్రైవేటు ఆసుపత్రులలో సమస్య ఆవిర్భవించినప్పుడు సంబంధిత ఆసుపత్రులపై చర్యలు తీసుకోకపోవడం ఒక కారణమా..అందుచేత ప్రైవేటు ఆసుపత్రుల్లో సమస్యలు పునరావృతం కావడం సర్వసాధారణమై ఉండొచ్చు. ప్రైవేటు ఆసుపత్రి యాజమాన్యాలతో అధికారులు కుమ్మక్కై ప్రజల ప్రాణాలను గాలికి వదిలేశారని ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఆసుపత్రి యాజమాన్యాల చదరంగంలో భాగంగా రాజకీయ ఒత్తిళ్లకు అధికారులు భయపడుతున్నారా.. మరి ఇంకేమైనా ములాజలు ఉన్నందున ఆసుపత్రులపై చర్యలు తీసుకోకుండ నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థం కావడం లేదని ప్రైవేటు ఆసుపత్రుల వల్ల నష్టపోయిన ప్రజలు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రైవేటు ఆసుపత్రులపై సమగ్ర విచారణ జరిపి ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండ విధుల పట్ల అంకితభావంతో ఉండి అధికారులు విధులను నిర్వహించాలి. ప్రజల ప్రాణాలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఈ ఆసుపత్రులను సీజ్ చేసి వైద్యులపై కఠిన చర్యలు తీసుకుంటే అమాయక ప్రజల ప్రాణాలు కాపాడినవారుగా అధికారులు నిలుస్తారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆరోగ్య శ్రీ పథకాన్ని నిర్వహిస్తున్నారు. ప్రజల ఆరోగ్యం కోసం ఆరోగ్య శ్రీ కార్డును పట్టుకుని ప్రైవేటు ఆసుపత్రిని ఆశ్రయిస్తే సంబంధిత ప్రైవేటు ఆసుపత్రి సిబ్బంది ముందు..వెనక..చూసుకోకుండ అతని యొక్క వివరాలు తీసుకుని తొందర తొందరగా అత్యవసరంగా జాయిన్ చేసుకుంటారు. ఆరోగ్యశ్రీ అనుమతి వచ్చేదాక అరకొరగా వైద్యం అందిస్తూ సంబంధిత డబ్బులు ఆసుపత్రి అకౌంట్‌కు జమ కాగానే రోగి వైద్యం మధ్యలో ఉండగా వైద్యులు మరొక సీరియస్ ప్రాబ్లమ్ ఉందని దానికి ఆరోగ్యశ్రీ వర్తించదని ఆపరేషన్ చేయకపోతే రోగి ప్రాణానికి ప్రమాదం అని బెదిరిస్తూ రోగి యొక్క బంధుమిత్రులను ఎమోషనల్ బ్లాక్‌మెయిల్‌కు ప్రైవేటు ఆసుపత్రి యాజమాన్యాలు పాల్పడుతున్నట్లు ప్రజలు ఆవేదన చెందుతూ బహిరంగంగా చర్చించుకుంటున్నారు. మరొక ఆసుపత్రిలో పేరుకేమో ఆరోగ్యశ్రీ కానీ ప్రతీది రోగి యొక్క బంధువులతో వైద్యానికి సంబంధించిన ప్రతీది బయట నుండి తెప్పించుకుని వైద్యం అందిస్తున్న ఆసుపత్రులు ఎన్నో ఉన్నాయి. ఇంకా కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ బడ్జెట్‌కు వచ్చే వైద్య పరికరాలు నాణ్యత తక్కువగా ఉంటుందని అందుకోసం రోగితో బయటి నుండి తెప్పిస్తున్నామని చెబుతున్నారంటా. అంతేకాకుండ రోగికి సంబంధించిన వ్యక్తులతో వారు ఇష్టపూర్వకంగానే బయట నుండి వైద్యానికి కావాల్సినవి తెచ్చి ఇస్తున్నట్లు ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు వీడియో తీసుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. జిల్లాలో ప్రతి గ్రామంలో ప్రథమ చికిత్స పేరుతో ఆర్‌ఎంపి డాక్టర్ల నిర్వహణ కచ్చితంగా ఉంటుంది. తమ గ్రామాల్లో వైద్యం అందిస్తున్న ఆర్‌ఎంపి వైద్యులను నమ్ముకుని వారి దగ్గరికి ప్రజలు వెళతారు. ఉన్నతమైన వైద్యం కొరకు ఆయన తనకు పర్సెంటేజ్ ఇచ్చే ఆసుపత్రులకు మాత్రమే సిఫారసు చేసి పంపిస్తాడు. ఈ విషయాన్ని గ్రహించలేని పల్లె ప్రజలు గ్రామాల్లో ఆర్‌ఎంపి డాక్టర్ చెప్పింది తమ మంచి కొరకు అనుకుని ఆర్‌ఎంపి డాక్టర్ నిర్ణయించిన ఆసుపత్రికి వెళతారు. వారికి తెలియదు కదా ఆర్‌ఎంపి రెఫర్ తీసుకుని వెళితే ప్రైవేటు ఆసుపత్రిలో బిల్లు ఇంకాస్త ఎక్కువవుతుందనే విషయం తెలియదు. ప్రతి ప్రైవేటు ఆసుపత్రికి సంబంధించిన తంతు ఇదే అని తెలియని ప్రజలు తమ జేబులో ఉన్న చిల్లర కాస్త ఖాళీ చేసుకుంటున్నారు. ప్రాణాలు కాపాడుకోవడం కోసం దొరికిన చోటంతా అప్పులు తెచ్చి మరీ ఆసుపత్రికి చెల్లిస్తారు. పై విధంగా జరుగుతున్నటువంటి ప్రైవేటు వైద్య మాఫియాను అడ్డుకునే వారే లేరా..అని ప్రజల ఆవేదన. సమాజంలో ఉన్న ఎన్నో ప్రభుత్వ శాఖలలో ప్రాణాలకు ముడిపడి ఉన్న శాఖ వైద్య శాఖ. ఈ శాఖకు సంబంధించి ఎన్నో సమస్యలు ఉన్నా వీటి పరిష్కారానికి ఎవరు చొరవ తీసుకుంటే సమస్యకు పరిష్కారం జరుగుతుందో తెలియక అయోమయంలో వైద్యం కోసం వెళ్లి ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాట మాడే ప్రైవేటు ఆసుపత్రులపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వైద్య రంగంలో అక్రమ ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రైవేటు ఆసుపత్రులపై ఆరాతీసి సమగ్ర విచారణ జరిపి సమస్య ఉన్న ప్రైవేటు ఆసుపత్రులపై కొరడా ఝుళిపించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

# తిలా పాపం తలా పిడికెడు..

(మొదటి పేజి తరువాయి)

కూలిపని, చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న మహిళల కష్టార్జితాన్ని జలగల్లా పీడిస్తూ వసూళ్ళకు తెగబడుతున్నారు. అయినా వారి అక్రమాలపై చర్యలు మాత్రం శూన్యమే. ఆర్‌పిల అక్రమాలన్ని అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నాయనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ తరహా అక్రమాలకు పాల్పడే ఆర్‌పిలకు ప్రజలకు అండగా ఉండాల్సిన ప్రజాప్రతినిధులు సైతం వెన్నుదన్నుగా నిలవడంలో మర్మం ఏమిటో వారికే తెలియాలి.

డోన్ మున్సిపాలిటీలో దాదాపు 12 వందల పొదుపు సంఘాలు ఉండగా, వాటి పర్యవేక్షణ కొరకు 40 మంది ఆర్‌పిలు విధులు నిర్వహిస్తున్నారు. కొంతమంది ఆర్‌పిల నిర్వాకాల కారణంగా మెప్మా విభాగానికి అవినీతి మరకలు అంటుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. పొదుపు సంఘాలకు రుణాలు మంజూరు చేస్తే ఒక్కో సంఘం నుంచి రుణ మొత్తంలో 8శాతం సొమ్ము కమీషన్ రూపంలో వసూళ్ళు చేస్తున్నారట. ఇదేమిటని అడిగితే అధికారులకు వాటాలు ఇవ్వాలని చెబుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే కొంతమంది ఆర్‌పిలు ఏకంగా మహిళలు చెల్లించే రుణ వాయిదాల సొమ్మును సొంతానికి వాడుకుంటూ తికమక లెక్కలతో మహిళలతోనే అధిక వాయిదాలు వసూళ్లు చేస్తున్నారు. వారి బండారం బయట పడినప్పుడు గుట్టుచప్పుడు కాకుండా వాడుకున్న సొమ్మును తిరిగి బ్యాంక్‌లో చెల్లించేది పరిపాటిగా మారింది. ఈ తరహా తతంగాలు అధికారుల దృష్టికి వెళ్ళినా చర్యలు మాత్రం తీసుకోరు. ఆర్‌పిల నుంచి అందుకుంటున్న వాటాల కారణంగానే వారిని అధికారులు వెనుకేసుకొస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. విచారణ పేరుతో మీటింగ్‌లు ఏర్పాటు చేసి మరీ పొదుపు సభ్యులపై బెదిరింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం.

అధికారుల సహకారం, రాజకీయ నాయకుల అండదండలతో తమను ఎవ్వరూ ఏమి చేయలేరంటూ ఆర్‌పిలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

డోన్‌లో అయితే పొదుపు సంఘాలలో మితిమీరిన రాజకీయ జోక్యం పలుమార్లు వివాదాలకు దారితీసిన ఘటనలు చోటుచేసుకున్నాయి. గతంలో జరిగిన పట్టణ సమాఖ్య ఎన్నికలకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం, నాయకులు ఎన్నికను పర్యవేక్షించడం ఇందుకు నిదర్శనం. ఆర్‌పిల మధ్య ఘర్షణలు జరిగి పోలీసుస్టేషన్‌ల వరకు పంచాయితీలు వెళ్ళిన ఘటనలు పలుమార్లు చోటుచేసుకున్నప్పటికీ అధికారులు మాత్రం ప్రేక్షకపాత్రలోనే మిన్నకుండిపోయారు. లాభదాయకమైన ఆర్‌పి ఉద్యోగం కోసం ప్రభుత్వాలు మారినప్పుడు రాజకీయ పైరవిలు కూడా తీవ్రస్థాయిలో జరుగుతాయనేది అందరికీ తెలిసిందే. ప్రస్తుతం కూడా అవినీతి ఆరోపణలు ఎదుర్కుంటున్న ఓ ఆర్‌పికి అధికారులతో పాటు ఓ ప్రజాప్రతినిధి వత్తాసు పలుకుతూ ఆమె అక్రమాలకు అండగా నిలుస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. పేద మహిళల నుంచి అక్రమ వసూళ్ళు చేసే ఆర్‌పిలపై కఠినచర్యలు తీసుకుంటే ముమ్మందు ఆర్‌పిలు అక్రమాలకు పాల్పడే అవకాశం ఉండదని పలువురు అభిప్రాయపడుతున్నారు. పాలకులు సైతం వారి అనుచరులను సదరు విషయాలలో జోక్యం చేసుకోకుండా నిలువరించి మహిళలకు మేలుచేయాలనిప్రజలు కోరుతున్నారు.

# తుంగభద్ర @ 50 టీఎంసీలు

(మొదటి పేజి తరువాయి)

వరదనీరు వచ్చి చేరుతుంది.పూర్తి నీటిమట్టం 1630 అడుగులు గాను 1615.79 అడుగుల నీటిమట్టం చేరింది.ఆశాజనకంగా వరదనీరు వచ్చి చేరుతున్నప్పటికి 19 గేట్ పని చెయకపోవడం కారణంగా ఈ సారీ ఒకే పంటలకు నీటిని అందిస్తున్నట్లు బోర్డు అధికారులు చెబుతున్నారు.రెండు పంటలకు సాగునీటిని అందించాలని అటు కర్ణాటక,ఇటు ఆంధ్రా రాష్ట్రాల రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.గత ఏడాది గేట్ తెగిపోతే వేసవి కాలంలో అధికారులు కాలయాపన చేశారని,నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించారని రైతులు, రైతు సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు.కర్నూల్ జిల్లా పశ్చిమ ప్రాంతాల పరధిలో తుంగభద్ర దిగువ కాలువ ప్రవహిస్తున్నప్పటికి దిగువ కాలుపై ఆధారం పడి ఉన్న రైతన్నలు చాలా మంది ఉన్నారు. కాలువకు నీటిని విడుదల చేస్తారని సమాచారం అందుకుని బోరు బావుల కింద వెసిన వరినారుకు అడ్వాన్స్ ఇచ్చి ఉన్నారు.కాలువకు నీరు రాగానే సాగుకు సన్నద్ధం అవుతారు.ఇదిలా ఉండగా రేపు బెంగళూరులో నీటి సలహా సమితి (ఐసిసి) సమావేశాన్ని నిర్వహిస్తారన్నది పాఠకులకు విధతమే.నిటిని విడుదలపై చర్చించి సలహా మండలి సమావేశంలో తీర్మానం చేస్తారు.ముందుగా కర్ణాటక కోటా కింద నీటిని విడుదల చేస్తారు.తద్వారా ఆంధ్రా అధికారులు ఇచ్చిన ఇండేంట్ ప్రకారంగా ఆంధ్రా కోటాను అందిస్తారు.

# దేశానికి చీకటి రోజులు చూపించిన కాంగ్రెస్ అధినేత్రి ఇందిరాగాంధి

- ప్రజా స్వామ్యం హత్యగావించిన దినం
- దేశ భక్తుల కుటుంబాలను సన్మానించడం మహాభాగ్యం –బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** భారత దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించడంతో ప్రజలకు చీకటి రోజులను అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ చూపించిందని బీజేపీ సీనియర్ నాయకులు నరసింహ రావు, నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షులు అ భిరుచి మధు అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ 1975 జూన్ 25న ఎమర్జెన్సీ ప్రకటించి 20 నెలల పాటు దేశానికి చీకటి రోజులు చూపించిందని అన్నారు. ఇండియా అంటే ఇందిరా,



దేశభక్తులను సన్మానిస్తున్న దృశ్యం

ఇందిరా అంటే ఇండియా తప్ప మరో మాట మాట్లాడిన ప్రతిపక్ష రాజకీయ పార్టీలు, స్వత్రంత భావజాలం కలిగిన నాయకులు, పత్రిక స్వేచ్ఛ, వ్యక్తిగత స్వేచ్ఛలను హరిస్తూ కఠిన మైన నిర్ణయాలతో జైల్‌లో వేసేవారని అన్నారు. నిరంకుశ పాలన సాగించిన దినాన్ని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యం, హత్య గావించిన దినంగా ప్రకటించిందని అన్నారు. చీకటి పాలన సాగించిన ఇందిరా గాంధీని, మరుసటి ఎన్నికల్లో ఘోర పరాభవం ప్రజలు చూపించారని అన్నారు. దేశ భక్తుల త్యాగాలు, స్వతంత్ర్యం కోసం ఆంగ్లేయులను తరమికొట్టి ఎందరో మహనీయులు పోరాటం చేశారని అన్నారు. మనం మంచి వాతావరణంలో జీవిస్తున్నా మంటే వారిత్యాగాలే అని అన్నారు. వారిని గౌరవించుకోవాల్సిన అవసరం మనపై ఉందని అన్నారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు జిల్లాలో ఎమర్జెన్సీ సమయంలో అరెస్టు చేయబడ్డ దేశ భక్తులను గుర్తించి వారి త్యాగాన్ని కీర్తిస్తూ వారి కుటుంబ సభ్యులను పండుగ వాతావరణంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో మేడా మురళీధర్, బీజేపీ నాయకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలి



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న జేఏసీ నాయకులు

**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్ :** వక్ఫ్ బచావో.. దస్తూర్ బచావో.. నరేంద్ర మోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం తీసు కొచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని ఏపీ రాష్ట్ర జేఏసీ కోకన్వీనర్ మౌలానా జకీర్ హుసేన్ అన్నారు. బుధవారం నంద్యాలలోని డబ్ర మస్జీద్‌లో జరిగిన నంద్యాల ముస్లిం జేఏసీ సమావేశానికి ముఖ్య అథితిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30వ తేదీన సాయంత్రం 5 గంటలకు ఎస్టీబీసీ కళాశాల మైదానంలో ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపీఎల్బీ) ఆధ్వర్యంలో వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా జరిగే వక్ఫ్ బచావో – దస్తూర్ బచావో భారీ బహిరంగ సభను విజ యవంతం చేయాలని ముస్లింలకు పిలుపుని చ్చారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ నల్ల చట్టాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 30వ తేదీన ఎస్టీబీసీ కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నామని, జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభ ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు సేవ్ వక్ఫ్ – సేవ్ కానిస్టిట్యూషన్ నంద్యాల, కర్నూలు జిల్లాలలో జాయింట్ యాక్షన్ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నా మని తెలిపారు. అనంతరం బహిరంగ సభకు సంబంధించిన గోడపత్రికలను వారు విడుదల చేశారు. ఈ సమావేశంలో నంద్యాల జేఏసీ కన్వీనర్ మౌలానా అబ్దుల్లా రషాది, జేఐహెచ్ అబ్దుల్ సమద్, కో కన్వీనర్ మస్తాన్, ట్రెజరర్ ఎస్పీ బాష, మౌలానా ఇద్రీస్, ఎస్టీపీఐ ఏజాజ్, ఏఐఎంఐఎం ఆయూబ్, ఇబ్రహీం, మౌలానా రఫీ సిరాజి, మౌలానా హుసేన్ రషాది, హాఫీజ్ ముస్తఫా, హాఫీజ్ ఇసాక్, హాఫీజ్ అర్షద్, హాషీజ్ ముద్దసిర్, హాఫీజ్ రహ్మతుల్ల, తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయాల్లో,దర్గాల్లో అమావాస్య పూజలు



మాళమల్లేశ్వరస్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు

**హొళగుంద,మేజర్‌న్యూస్ :** మండలంలోని వివిధ దేవాలయాలలో, ఎల్లార్తి తాతల దర్గాలో బుధవారం అమావాస్య సందర్భంగా భక్తులు విశేషంగా పూజలు చేశారు.దేవరగట్టు మాళమల్లేశ్వ రస్వామి,మాళమ్మదేవి,హొళగుంద కొండ గుహలో కొలువైన శ్రీ సిద్దేశ్వరస్వామి, వీరభద్రేశ్వరస్వామి దేవాలయాలలో భక్తులు విరిగా హజరై పూజలు చేసి మొక్కుబడుల ను తీర్చుకున్నారు.స్వామి వార్లకు అభిషే కాలు చెయించారు.తాతల దర్గాలో భక్తులు ప్రత్యేకంగా ఫాతేహల్ చేశారు.భక్తులు మండలం నుండి కాకుండా కర్ణాటక ప్రాం తాల నుండి అధిక సంఖ్యలో వచ్చారు. దేవాలయాలో,దర్గాలో భక్తుల సందడి నెలకొంది.వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.ముఖ్యంగా మట్టి ఎద్దుల అమా వాస్య కావడంతో ఇంటిల్లి పాదిగా ఎద్దులను పెట్టి పూజలు చేశారు.చిన్నారులు మట్టి ఎద్దులతో విధులలో చిందులు తొక్కారు.

# అకాడమిక్ ఇన్స్ట్రక్టర్ల నియామకం చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయు నాయకులు

**ఆదోని రూరల్, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభు త్వం ఇటీవల ఉపాధ్యాయుల కొరత ఉన్న ప్రతి పాఠశాలలో అకాడమిక్ ఇన్స్ట్రక్టర్ల నియామకం వెంటనే చేపట్టాలని రాష్ట్రోపాధ్యా య సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆదోని పర్యటనలోభాగంగా పాఠశాల వసతు లను, విద్యార్థుల,ఉపాధ్యాయుల సమస్యల ను తెలుసుకున్నారు. అనంతరం ఆదోని రూరల్, అర్బన్, కౌతాళం ఎస్టీయు నాయకు లు సుంకన్న, వీరచంద్రయాదవ్, మహాదే వప్ప, సుధాకర్ ఆధ్వర్యంలో మదిరె 111, విరుపాపురం, దొడ్డనగేరి ఉన్నత పాఠశా లలను రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా ప్ర. దాన కార్యదర్శి టి.కె.జనార్ధనతో కలిసి రాష్ట్ర అధ్యక్షులు శ్రీ సాయి, శ్రీనివాస్‌లతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల పదోన్నతులు బదిలీలు పొందిన ఉపాధ్యాయు లను వెంటనే కేడర్ స్ట్రేంత్‌ను పొజిషన్ ఐడిలను అప్డేషన్ చేసి 2025జూన్ నెల జీతాలు సకాలంలో చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయు నాయకులు వెంకోబ, శేక్షావలి, ఆంజనేయ, సూర్యుడు, తదితరులు పాల్గొన్నారు.

# వృద్దులకు ఐదురోజులు ముందుగానే రేషన్



మాట్లాడుతున్న సివిల్ సప్లై డిటీ శివరాం

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** రేషన్ సరుకుల పంపిణీలో 65సం॥లు పైబడిన వృద్దులకు ఐదురోజులు ముందుగానే ఈ నెల 26వ తేదీ(నేటి) నుంచి 30వ తేదీ వరకు డీలర్లు ఇంటివద్దకే అందచేయాలని తహశీల్దార్ విద్యాసాగర్, సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ శివరాంలు డీలర్లను ఆదేశించారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో రేషన్ షాపు డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీలర్లతో వారు మాట్లాడుతూ 65ఏళ్లు పైబడిన వృద్దులకు జూలై నెలకు ఇవ్వాల్సిన రేషన్‌కు సంబంధించి ఈ నెల 26నుంచి 30వ తేదీ వరకు నేరుగా ఇంటికి సరుకులు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అందుకు మీ పరిధిలో ఉన్న వృద్దులకు సక్రమంగా రేషన్ అందేలా చూసుకోవాలన్నారు. ప్రభుత్వం మొబైల్ ఫోన్‌ల ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేయడం జరుగుతుందని కావున ప్రతిఒక్కరు పని చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు మిశ్రమ పంటలు వేసుకోవాలి

- మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్



**బండి ఆత్మకూరు రూరల్ ,మేజర్ న్యూస్ :** మిశ్రమ పంటల (అంతర పంటలు) ద్వారా అధిక దిగుబడు లు పొందవచ్చని మండల వ్యవసా య అధికారి ప్రవీణ్ కుమార్ తెలిపారు. బుధవారం బండి ఆత్మ కూరు మండలంలోని పార్నపల్లి, సింగవరం గ్రామంలో పొలం పిలుస్తుంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులు పంటలు వేసుకుని మొదలు పంట నూర్పుడి చేసేంతవరకు ఎప్పటికప్పుడు స్థానిక వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు తీసుకొని అధిక దిగుబడులు పొందవచ్చన్నారు.రైతులు రసాయనిక ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల పై దృష్టి సారించాలని,సుస్థిర వ్యవసాయం మరియు వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి వేసిన పంటలలో పెట్టుబడులు తగ్గి అధిక దిగుబడి సాధించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కౌలు రైతులు సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారి వద్ద కౌలు గుర్తింపు హక్కు పత్రాలను తప్పనిసరిగా పొందాలని ఏవో కోరారు. అలాగే పశుసంపద కలిగిన రైతులు పశుగణన మరియు గాలి కుంట టీకాలు వేయించుకోవాలని వెటర్నరీ డాక్టర్ జోష్ణ తెలిపారు. అనంతరం కౌలు రైతులకు గ్రామ సర్పంచ్ వారు కౌలు గుర్తింపు హక్కు పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐసి ఇన్సూరెన్స్ ఫీల్డ్ అసిస్టెంట్ వినయ్, వీఆర్వో అబ్దుల్ కలాం, గ్రామ వ్యవసాయ అధికారులు మంజుల ,గిరిధర్, గ్రామ సర్పంచులు షబ్బీర్ అహ్మద్ శూల రాణి, పలువురు రైతులు పాల్గొన్నారు.

# నారాయణపురంలో దొంగలు హల్‌చల్

- బంగారు నగలు, నగదు ఎత్తుకెళ్లిన దుండగులు
- లబోదిబోమంటున్న మహిళా టైలర్





మహిళా టైలర్

బండి ఆత్మకూరు రూరల్, మేజర్ న్యూస్ : బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న బరకల కాలనీలో ఓ మహిళా టైలర్ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి బంగారం గొలుసులు,దాచుకొని పెట్టుకున్న డబ్బులు ఇంటి తాళాలు పగలగొట్టి చోరీ చేసిన సంఘటన వెలుగులోనికి వచ్చింది. బరకాల కాలనీ కి చెందిన మహిళ బాధితురాలు చిందుకూరు లీలావతి చెప్పిన వివరాలు మేరకు తాను టైలర్ వృత్తిపై జీవనం కొనసాగిస్తూ ఉన్నానని,తన కూతురును హాస్టల్లో చేర్పించేందుకుగాను ఈనెల 18న లీలావతి గిద్దలూరు కు వెళ్లానని చెప్పింది., తన ఇంటి పక్కన ఉన్న వారు పూల కోసం లీలావతి ఇంటికి దగ్గరికి రాగా ఇంటి వాకిలి తెరచి ఉండటం గమనించి స్థానికులకు సమాచారం ఇచ్చారని చెప్పింది. ఈ విషయాన్ని వెంటనే గిద్దలూరు లో ఉన్న లీలావతికి సమాచారం అందించారు. లీలావతి అదేరోజు రాత్రి పోలీస్ స్టేషన్కు వచ్చి ఫిర్యాదు చేసింది. పోలీసులు అదే రాత్రి బాధితురాలు ఇంటికి వచ్చి చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి ఫోటోలు తీసుకుని వెళ్లారు. సోమవారం ఉదయం క్లూస్ టీం వారు వచ్చి వేలిముద్రల ను తీసుకొని వెళ్లారు. తర్వాత బాధితురాలు పోలీస్ స్టేషన్ కి వెళ్లి జరిగిన విషయాన్ని గురించి ఎస్ఐకి తెలిపింది. బీరువాలోని రెండు లక్షల 40 వేల రూపాయల నగదు రెండున్నర తులాల తాళిబొట్ల గొలుసు తులం పావల ,లక్ష్మీకాసుల దండ, డిజైన్ కమ్మలు మూడు జతలు గుట్టకమ్మలు ఒక జత మాటిల్లు, చెంప స్వరాలు పట్టీలు మొత్తం కలిపి 7 తులాల వరకు ఉంటాయని బాధితురాలు పోలీసులకు వివరించింది.. గ్రామంలో ఉన్న 36 సెంట్ల భూమి అమ్ముకొని డబ్బు తెచ్చుకున్నాను అని అందులో కొంత సొమ్మును అప్పు కట్టుకొని మిగతా సమయంలో బీరువాలో పెట్టి ఊరికి వెళ్ళిపోయానని ఇంతలోనే దుండగులు అపహరించుకు వెళ్లాలని బాధితురాలు కన్నీరు అయ్యింది. ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# త్వరలో విశ్వేశ్వరయ్య కూడలి కుదింపు

– కమీషనర్ రవీంద్రబాబు

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** నగరంలో ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు ప్రధాన ప్రాంతాల్లో కూడళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమీషనర్ యస్ రవీంద్రబాబు తెలిపారు. బుధ వారం ఆయన మున్సిపల్, ఆర్అండ్‌బి శాఖల అధి కారులతో కలిసి వివిధ ప్రాంతాల్లో కూడళ్ల ఏర్పా టుకు ప్రదేశాలను పరిశీలించారు. ఆనంద్ థియే టర్ వద్ద కిసాన్ ఘాట్–బంగారు పేట వెళ్లే రహదా రిలో, కొత్త బస్టాండ్ సుందరయ్య కూడలి, వై జంక్షన్ ప్రాంతాల్లో కూడళ్ల ఏర్పాటుకు, గాయత్రీ ఎస్టేట్ విశ్వేశ్వరయ్య సర్కిల్ నందు కూడలి కుదింపునకు చర్యలు తీసుకోవాలని కమీషనర్ అధికారులను ఆదేశించారు. కార్యక్ర మంలో ఆర్అండ్‌బి యస్ఈ మహేశ్వర్ రెడ్డి, డిఈఈ సాయిరాం, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఇంచార్జ్ ఎస్ఈ శేషసాయి, డిఈఈ గంగాధర్, ట్రైనీ ఏఈ ఖాసీం వలి తదితరులు పాల్గొన్నారు.



కూడళ్ల ఏర్పాటు ప్రదేశాలను పరిశీలిస్తున్న కమీషనర్ రవీంద్రబాబు

# జిల్లాలో జీఎస్టీ ఆదాయాన్ని పెంచాలి : కలెక్టర్ రాజకుమారి


అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** జిల్లాలో జీఎస్టీ రెవెన్యూ ఆదాయాన్ని పెంచడానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో కమర్షియల్ ట్యాక్స్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో జీఎస్టీ ఆదాయాన్ని పెంచడానికి సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్థిక వనరులను అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలు సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లాలో సుమారు 12,033మంది పన్ను చెల్లింపుదారులు ఉన్నారన్నారు. జిల్లాలో నూతన సంస్థ ఏర్పాటు చేస్తుంటే తగిన సమాచారాన్ని అందజేయాలన్నారు. జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలు, క ళాశాలలు ఉన్నాయని అందులో ఉన్న సిబ్బందికి ప్రొఫెషనల్ ట్యాక్స్‌లోకి వచ్చారా లేదా అనేది చూడాలన్నారు. ముఖ్యంగా వస్తువులకు సంబంధించి రూ.40లక్షలు, కాంట్రాక్ట్ సర్వీసులకు రూ.20లక్షలు దాటిన వారి వివరాలు తెలపాలన్నారు. ఒక కాంట్రాక్ట్‌కు సంబంధించి రూ.2.5లక్షలు దాటితే 1శాతం సిజిఎస్టీ, 1శాతం ఎస్జీఎస్టీ వసూలు చేయాలన్నారు. ప్రతినెల 10వ తేదీ లోపు జీఎస్టీ 7ఆర్‌ను ఫైల్ చేయాలని లేని యెడల ప్రతిరోజు వంద రూపాయలు చొప్పున డిడిఓ నుంచి వసూలు చేయడం జరుగుతుంద న్నారు. అంతకు ముందు వణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ సుధాకర్‌రావు, డిప్యూటీ కమిషనర్ సురేష్‌లు వాణిజ్య పన్నుల శాఖ విధి, విధానాలు, జీఎస్టీ నిర్వహణ, జీఎస్టీ ట్యాక్సేషన్ తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో జిలాల్ల ఎస్పీ అధిరాజ్ సింగ్, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, నంద్యాల వాణిజ్య పన్నుల శాఖ 1 , 2 సహాయ కమిషనర్లు లక్ష్మీనాయక్, సుజిత, ఆర్డీవోలు విశ్వనా థ్, నరసింహులు, అరుణజ్యోతి, జిల్లా ఖజా నా అధికారి లక్ష్మీదేవి, మున్సిపల్ కమిష నర్లు, ఎల్డీఎం, అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల ఆశయాలను నెరవేర్చేందుకు టిడిపి నిరంతర కృషి

### డోన్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి


ఎన్‌టీఆర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కోట్ల, టిడిపి నాయకులు

**డోన్, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ప్రజల ఆశయాలను నెరవేర్చేందుకు తెలుగుదేశం పార్టీ నిరంతరం కృషి చేస్తుందని డోన్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని సాయిఫంక్షన్ హాల్ నందు నిర్వహించిన డోన్ నియోజకవర్గ సంస్థాగత ఎన్నికల సమావేశానికి ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి హాజరైయ్యారు. ఈ సందర్భంగా దివంగత కీశే.నందమూరి తారకరామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికల సమావేశంలో నందమూరి తారకరామారావు ఆదర్శాలను గుర్తు చేసుకునే సందర్భమనీ, పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు దూరదృష్టిని నమ్ముకొని రాష్ట్ర అభివృద్ధి కోసం నిబద్ధతతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రజల ఆశయాలను నెరవేర్చేందుకు నిరంతరం కృషి చేసే పార్టీ అని, ఈ సమావేశం ద్వారా ప్రతి కార్యకర్త, నాయకుడు నూతనోత్సాహంతో, కొత్త దిశలో పార్టీని ముందుకు తీసుకెళ్ళేందుకు సిద్ధమౌతున్నారన్నారు. ఒక సాధారణ ఎన్నికల ప్రక్రియ మాత్రమే కాకుండా మన కృషిని ప్రతిబింబించే, భవిష్యత్తు దిశను నిర్దేశించే ఒక గొప్ప అవకాశమని, ప్రతి కార్యకర్తకు, నాయకుడి పాత్ర ఉందని వారి సహకారంతోనే పార్టీ విజయవంతంగా దశలవారిగా ఎదుగుతుందన్నారు. కావున పార్టీ బలోపేతానికి మనమందరం కలిసికట్టుగా ముందుకు సాగాలని టిడిపి నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు వై.నాగేశ్వరరావుయాదవ్, వలసల రామకృష్ణ, నియోజకవర్గ పరిశీలకులు కెసి.హరి, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు అరుణ్‌నాయక్, విజయ్‌కుమార్, మండల పరిశీలకులు గడ్డం రామకృష్ణారెడ్డి, పట్టణ పరిశీలకులు ఎన్.వి.రామకృష్ణ, ప్యాపిలి మండల పరిశీలకులు గోవింద్‌నాయక్, బేతంచెర్ల మండల, పట్టణ పరిశీలకులు దూదేకుల జైనాబీ, జనార్దనచారి, డోన్ ఓంప్రకాష్, రంజిత్‌కిరణ్, డోన్, బేతంచెర్ల, ప్యాపిలి మండలాల బూత్, క్లస్టర్లు, యూనిట్, కన్వీనర్లు, కో కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు హాజరైయ్యారు.

### రహదారుల ప్రమాదాల నివారణకు

# పటిష్టమైన చర్యలు చేపట్టాలి

- జిల్లాను ప్రమాదాల రహితంగా రూపొందించేందుకు కృషి చేయాలి
- నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ : జిల్లాలో రహదారుల భద్రత, ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని విడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాతో కలిసి జిల్లా స్థాయి రహదారి భద్రత సమన్వయ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏడాది ఏప్రిల్, రెండు నెలల్లో 98 రహదారి ప్రమాదాలు జరగగా, అందులో 50 మంది మృతి చెందారని అన్నారు. రహదారుల్లో బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాల నివారణకు పూర్తిస్థాయిలో కృషి చేయాలని అన్నారు. ఎన్‌హెచ్ 40లోని అన్ని మీడియన్ ప్రాంతాల్లో లైటింగ్ ఏర్పాట్లు పెంపొందించాలని అన్నారు. జిల్లాలోకి రావడానికి నాలుగు ప్రధాన రహదారులు ఉన్నాయని, అందులో మహానంది, చాపిరేవుల డౌన్, చాబోలు రోడ్డు, ఆళ్ళగడ్డ నుంచి వచ్చే ప్రయాణీకులు స్వాగతం పలికేలా పెయింటింగ్స్ రాసేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమీషనర్‌ను ఆదేశించారు. ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్స్, సూచిక బోర్డులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా నూనెపల్లె నుంచి బొమ్మలసత్రం వెళ్ళే దారిలో సరైన విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. పోలీస్, ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ఎక్కువ శాతం బ్లాక్ స్పాట్స్ ఉన్నాయని, నివారణ కోసం సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని అన్నారు. ముఖ్యంగా 340 సీ రహదారి రోడ్డుకు అప్రోచ్ రోడ్డు సరైన రీతిలో అనుసంధానం చేయాలని అన్నారు. గిద్దలూరు నుంచి నంద్యాలకు వచ్చే రహదారిలో స్పీడ్ బ్రేకర్స్, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. హిట్ అండ్ రన్ కేసుల పెండింగ్ అర్జీలను త్వరితగతిన పంపేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పోలీసుల సమన్వయంతో సమస్యలను త్వరగా పరిష్కరించాలని అన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు మెరుగైన వైద్య సేవలకు సిబ్బంది ఉండేలా చూడాలని డీఎంఅండ్ హెచ్‌వోను ఆదేశించారు. సీఎంఆర్ షాపింగ్ మాల్‌కు సంబంధించి పార్కింగ్ లేకపోవడంతో టౌన్ హాల్‌లో పార్కింగ్ చేసుకొని అందుకు తగిన రుసుము మున్సిపల్ నిధిలో జమ చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాకు అవసరమైన స్పీడ్ గన్స్ అందజేయాలని రవాణా శాఖ అధికారికి సూచించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు సైన్ బోర్డ్సు ఏర్పాటు చేయాలని అన్నారు. అలాగే హిట్ అండ్ రన్ కేసులకు సంబంధించి 41 కేసులు నమోదు కావడం జరిగిందని, 29 కేసుల వివరాలను కలెక్టర్ కార్యాలయానికి పంపించడం జరిగిందని అన్నారు. స్పీడ్ గన్ ఉపయోగిస్తే ప్రమాదాలు తగ్గే అవకాశం ఉందని అన్నారు. ఈ సమావేశంలో నంద్యాల ఏఎస్పీ మందా జావళి అల్ఫోన్స్, ఆళ్ళగడ్డ డీఎస్పీ ప్రమోద్ కుమార్, ఆర్అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, నంద్యాల మున్సిపల్ కమీషనర్ శేషన్న, జిల్లా రవాణా అధికారి ఐశ్వర్యరెడ్డి, డీఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ వెంకటరమణ, నేషనల్ ప్రాజెక్టు డైరెక్టర్లు, ఆయా శాఖల అదికారులు, పోలీసులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ కాలువలు నిర్మించండి


మేనేజర్ చిన్నరాముడుకు వినతిపత్రం అందిస్తున్న స్థానికులు

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** నగరంలోని 27వ వార్డు ఆదిత్యనగర్ నందు డ్రైనేజీ కాలువలు నిర్మించాలని నగరపాలక మేనేజర్ యన్ చిన్నరాముడుకు స్థానికులు విన్నవించారు. బుధవారం నగరపాలక కార్యాలయంలో మేనేజర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ తమ ఇంటి ఎదురుగా ఖాళీ స్థలాలు ఉన్నాయని, వర్షం కురిసినప్పుడు అక్కడ వర్షపునీరు చేరి దోమలు ప్రబలుతున్నాయని వాపోయారు. అలాగే ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి పాములు, తేళ్లు తిరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కావున తక్షణమే తమ కాలనీలో పిచ్చి మొక్కలు తొలగించి, డ్రైనేజీ కాలువలు నిర్మించాలని స్థానికులు రాఘవేంద్ర, యాకూబ్ హుస్సేన్, కృష్ణ మేనేజర్‌ను తదితరులు కోరారు.

# రైతులకు ఉచితంగా వేరుశనగ విత్తనాలు పంపిణీ

### మండల వ్యవసాయశాఖ అధికారి రాజేష్



**ప్యాపిలి, మేజర్‌న్యూస్:** ఎన్ఎంఈఓ-ఓఎస్ పథకం, జలదుర్గం ఎఫ్‌పిఓ ద్వారా వేరుశగన జిజెజి-32 రకం విత్తనాలను ఉచితంగా వేరుశనగ విత్తన ఉత్పత్తి పెంపుదల కొరకు అందజేసినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి రాజేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్యాపిలి, పిఆర్.పల్లి, మామిళ్ళపల్లె గ్రామాల రైతులకు బుధవారం వేరుశనగ విత్తనాలను అందజేశామని అధికారి రాజేష్ తెలిపారు. మండల టిడిపి నాయకులు మాజీ ఎంపిపి తొప్పెల శ్రీనివాసులు, సింగిల్ విండో మాజీ ఉపాధ్యక్షులు నడిగడ్డ నాగేంద్ర, తెలుగుయువత ప్యాపిలి మండల అధ్యక్షులు కోదండరామయ్యయాదవ్, టిడిపి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# తమ్ముళ్లకు ఆలస్యంగా జ్ఞానోదయం అయ్యింది

★ టిడిపిని వీడకండి.. బివిని వీడండి

★ చేజారి పోతున్న క్యాడర్ పట్ల బివి సమాధానం చెప్పుకోవాలి.. కోనేరు

**ఎమ్మిగనూరు, మేజర్‌న్యూస్ ప్రతినిధి :** ఎమ్మిగనూరు తెలుగు తమ్ముళ్లకు చాలా ఆలస్యంగా జ్ఞానోదయం అయ్యిందని ఇందుకు గల కారణాలు ఏవైనా ఉంటే వాటికి ఎమ్మెల్యే బివి జయనాగేశ్వరరెడ్డి అధిష్ఠానంకు , ఓట్లు వేసి గెలిపించిన ఓటర్లకు సమాధానం చెప్పుకోవాలి అని టిడిపి మాజి కౌన్సిలర్ కోనేరు నాగేంద్రప్రసాద్ ఓ ప్రకటనలో దుయ్యబట్టారు. బివి మోహన్‌రెడ్డి చివరి రోజుల్లో తనయుడు బివి జయనాగేశ్వరరెడ్డి వ్యవహారాలు, తను నైజం నచ్చక దురం అయ్యాను కాని తెలుగుదేశం పార్టీని వీడలేదన్నారు. ఆయన నైతికత నచ్చక ఎదురుతిరిగాను , విమర్శలు చేశాను, ఇందుకు ప్రతిఫలంగా బివిజెఆర్ తన అనుచరులతో హేలనగా, నీచమైన విమర్శలు చేయించారు, కేసులు పెట్టారు, అయినా టిడిపి పార్టీని వీడలేదు అన్నారు. తెలుగుదేశం పార్టీకి ఎవరు వ్యతిరేకులు కాకండి బివికి వ్యతిరేఖంగా పయనించండి, ఆయన అవలంభిస్తున్న వైకరి ప్రజలకు వివరించండి అని హితవు పలికారు. ఏళ్ల తరబడి పార్టీకి సేవలు చేసిన వారికి పదవులు కాకుండా వైసిపి నుండి ఎన్నికల తర్వాత వలసలు వచ్చిన వారిని అందలం ఎక్కిస్తున్నారని బాధ పడకుండా పార్టీలో ఉంటూ బివి చేస్తున్న చెడుపనులకు వ్యతిరేకం చాలన్నారు. ప్రజల దగ్గర ఎండగట్టండి, అవసరం అయితే చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకె ళ్లండి, చంద్రబాబు నమ్ముకున్న నాయకులు, కార్యకర్తలు పార్టీలోనే ఉండాలని విన్నవించారు. చంద్రబాబు నాయుడు సైతం బివి జయ నాగేశ్వరరెడ్డి ప్రేమను తగ్గించుకుంటే మంచిదన్నారు.

# బెల్లం ఊట ధ్వంసం

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** నగరంలోని బంగారుపేట లో నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించగా 1050లీటర్ల నాటుసారా తయారీకి ఉపయోగించే బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు అసిస్టెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాజశేఖర్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారు చేసినా, రవాణా చేసినా, అమ్మినా చట్టరీత్యా నేరమ న్నారు. నాటుసారా పూర్తిగా మానుకుని నాటుసారా లేని ప్రాంతంగా తీర్చిదిద్దాలని తెలిపారు. ఈ దాడుల్లో 1050లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి 20లీటర్ల నాటుసారా కలిగివున్న నీలి శికారి లక్ష్మీ అనే మహిళను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ చంద్రహాస్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్స్‌పెక్టర్ సుభాషిణి, సబ్ ఇన్స్‌పెక్టర్ నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.



# సరుకుల పంపిణీ ప్రక్రియలో అలసత్వం జరగకూడదు...

- ఈకెవైసీ వందశాతం పూర్తి చేయాలి
- దివ్యాంగులకు సరుకులు డోర్ డెలీవరి చేయాలి – సబ్ కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

**ఆదోని, మేజర్ న్యూస్ :** రేషన్ కార్డుల లబ్దిదారులకు నిత్యావసర సరుకులు (బియ్యం) పంపిణీ చేసే ప్రక్రియలో ఏటువంటి అలసత్వం ఉండకూడదని సబ్ కలె క్టర్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. బుధవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో రేషన్ డీలర్లు, రెవిన్యూ సిబ్బంది వారికి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, ఆదోని మండలంలో 116ఎఫ్.పి దుకాణాలకుగాను 79,400 రేషన్‌కార్డులు ఉన్నాయన్నారు. వీరికి ప్రభుత్వం అందిస్తున్న రేషన్‌సరుకులు సకాలంలో అందజేయాలన్నారు. దుకాణం ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు మరియు సాయంత్రం 4గంటల నుండి రాత్రి 8గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉండి రేషన్ సరుకులు పంపిణీ ప్రక్రియ చేయాలన్నారు. ముఖ్యంగా ఈకెవైసీ 70శాతం మాత్రమే పూర్తయినది. నిర్ణీత గడువులోపు వంద శాతం ఉత్తీర్ణత చేయాలన్నారు. 65 సంతవ్సరాలుపైబడిన వారికి, దివ్యాంగులకు 26నుండి 30వతేదిలోపు రేషన్ సరుకులు డోర్ డెలివరీ పంపిణీ చేయాలని సూచించారు. వారంలో నాలుగు రోజులు ఎఫ్.పి.దుకాణాలు ఆకస్మీకంగా తనిఖీ చేయాలని తహశీల్దార్‌కు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రమేష్, పౌరసరఫరాల శాఖ ఉప తహశీల్దార్ రుద్రగౌడ్, రెవిన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడ్డ వారికి పదవులు కేటాయించాలి....

నియోజకవర్గ టిడిపి యువనేత ధర్మవరం మన్నె గౌతమ్‌కుమార్‌రెడ్డి


సమావేశంలో పాల్గొన్న ధర్మవరం మన్నె గౌతమ్‌కుమార్‌రెడ్డి, నాయకులు

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్:** గత వైయస్‌ఆర్‌సిపి ప్రభుత్వ హయాంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని అక్రమ కేసులకు గురై తెలుగుదేశం పార్టీ బలోపేతానికి శాయశక్తుల కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు కమిటీలలో చోటు కల్పించాలని డోన్ నియోజకవర్గం టిడిపి యువనేత ధర్మవరం మన్నె గౌతమ్‌కుమార్‌రెడ్డి కోరారు. బుధవారం పట్టణంలోని సాయి ఫంక్షన్‌హాల్ నందు నిర్వహించిన డోన్ నియోజకవర్గం సంస్థాగత ఎన్నికల సమావేశానికి హాజరైన డోన్ నియోజకవర్గ పరిశీలకులు కేసి.హరిబాబు, విజయకుమార్, రామకృష్ణ, జరీనా బేగం, జనార్ధన్‌లకు ధర్మవరం మన్నె గౌతమ్‌కుమార్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సమావేశంలో నియోజకవర్గ, మండల, పట్టణ కమిటీకి టిడిపి నాయకులు, కార్యకర్తలు అప్లికేషన్ ద్వారా అప్లై చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఆర్.ఈ.రాఘవేంద్ర, పట్టణ టిడిపి అధ్యక్షులు చాటకొండ శ్రీనివాసులు, ప్యాపిలి మండల టిడిపి అధ్యక్షులు గండికోట రామసుబ్బయ్య, నంద్యాల జిల్లా టిడిపి బీసీసెల్ అధ్యక్షులు ప్రజావైద్యశాల బెస్త మల్లికార్జున, నాయకులు గంధం శ్రీనివాసులు, రాముడు, ఎరమలనాయుడు, బేతంచెర్ల శేషావలిచౌదరి, చక్రపాణిగౌడ్, నాగన్న, సిటికేబుల్ కిరణ్, యాపదిన్నె సర్పంచ్ రామిరెడ్డి, లోకేష్‌గౌడ్, నారాయణస్వామి, మధుసూదన్‌రెడ్డి, హనుమంతరెడ్డి, సలాం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నంద్యాల జిల్లా టిడిపి అధ్యక్షపదవి బీసిలకివ్వడం హర్షణీయం

- సంతోషం వ్యక్తం చేసిన వాల్మీకులు
- అధ్యక్షుడిగా తనను ఎంపిక చేయాలని కోరిన తొప్పెల శ్రీనివాసులు


నియోజకవర్గం, మండల పరిశీలకులకు వినతిపత్రం ఇస్తున్న తొప్పెల శ్రీనివాసులు

**ప్యాపిలి, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలనుసారం నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవిని బీసికు కేటాయించారు. దీంతో నంద్యాల జిల్లాలోని బీసి వర్గాలు ఆనందం వ్యక్తం చేశాయి. అలాగే తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి నేటి వరకు తెలుగుదేశం పార్టీకి నంద్యాల జిల్లా, డోన్ నియోజకవర్గంలోని ప్యాపిలి మండలంలో అహర్నిషలు చేసి, పార్టీకి సేవలందించిన మాజీ ఎంపిపి తొప్పెల శ్రీనివాసులు తనకు నంద్యాల జిల్లా టిడిపి అధ్యక్ష పదవికి తనకు అవకాశం ఇవ్వాలని కోరుతూ బుధవారం డోన్ పట్టణంలోని సాయిఫంక్షన్ హాల్ నందు బుధవారం జరిగిన సంస్థాగత ఎన్నికల కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్‌యాదవ్‌లను కోరుతూ డోన్ నియోజకవర్గం పరిశీలకుడు కేసి.హరినాయుడుకు, ప్యాపిలి మండల పరిశీలకుడు గోవింద్‌నాయుడులకు తొప్పెల శ్రీనివాసులు వినతిపత్రం సమర్పించారు. అనంతరం తొప్పెల శ్రీనివాసులు మాట్లాడుతూ నంద్యాల జిల్లా పరిధిలో బీసిలలో అధిక సంఖ్యలో బోయ కులానికి చెందిన వాల్మీకులు అధికంగా ఉన్నామని, కావున నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవిని వాల్మీకులకు కేటాయించాలని, అందులో ఎంతో అనుభవం, పార్టీకి అహర్నిషలు కృషి చేసిన, గతంలో తాను ప్యాపిలి మేజర్ గ్రామ పంచాయితీకి రెండు పర్యాయాలు సర్పంచ్‌గా, మరో రెండు పర్యాయాలు మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడిగా(ఎంపిపి) ఎన్నో సేవలను అందించానన్నారు. కావున బీసి సామాజికవర్గం బోయ కులానికి చెందిన తనకు నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా పార్టీకి సేవలు చేసుకోవడానికి అవకాశం కల్పించాలని కోరారు.

# మాజీ సి.ఎంను కలిసిన గుండం సూర్య ప్రకాష్ రెడ్డి, కాటసాని రామిరెడ్డి


మాజీ ముఖ్యమంత్రితో కాటసాని రామిరెడ్డి, సూర్య ప్రకాష్ రెడ్డి

**సంజామలమేజర్,న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని బుధవారం గుండం సూర్య ప్రకాశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిలు తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలం లోని పలు సమస్యలపై మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డితోపాటు , వైకాపా రాష్ట్ర అదనపు కార్యదర్శి గుండం సూర్యప్రకాష్ రెడ్డి చర్చించారు. మండలంలో ఎలాంటి సమస్యలు ఉన్నా జగన్ దృష్టికి తీసుకురావాలని ఆయన తెలిపారు. మండలంలో కార్యకర్తలు, నాయకులు చురుకుగా ఉండాలని జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. అదేవిధంగా మండల నాయకులు కార్యకర్తలకు అండగా ఉండాలని కార్యకర్తల సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని జగన్ మోహన్ రెడ్డి సూచించారు.

# నేటి నుండి రైతు సంబరాలు


పూజలందుకున్న పెద్దమ్మ తల్లి

**బనగానపల్లె మేజర్ ,న్యూస్:** బనగానపల్లె మండల పరిధిలోని యాగంటిపల్లె గ్రామంలో ఇటీవల గ్రామ దేవత పెద్దమ్మ తల్లి దేవర కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం ముగిసి 16రోజులు అయిన సందర్భంగా నేడు గ్రామ దేవత పెద్దమ్మ తల్లి వద్ద గ్రామ పెద్దల ఆధ్వర్యంలో వృషభాల బలప్రదర్శన ప్రారంభం కానుంది. ఇందులో మొదటి బహుమతి రూ.60వేలు, రెండవ బహుమతి 50వేలు, మూడవ బహుమతి 40వేలు, నాల్గవ బహుమతి 30వేల రూపాయలు అందించనున్నారు. ఇలా పది బహుమతులను అందజేయడం జరుగుతుందని గ్రామ పెద్దలు తెలిపారు. యాగంటిపల్లె గ్రామ దేవత శ్రీ పెద్దమ్మ తల్లి 16రోజుల పండుగ కార్యక్రమంలో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించి వారి కృపకు పాత్రులు కావాలని తెలిపారు.

# గురురాఘవేంద్ర ఎత్తిపోతలకు టెండర్ల ఆహ్వానం

- వైకాపా రాష్ట్ర రైతు విభాగ అధికార ప్రతినిధి గడ్డం హర్షం
- అధికారులకు కృతజ్ఞతలు తెలిపిన రైతులు


గడ్డంతో పాటు ధర్నాలో పాల్గొన్న రైతులు (ఫైల్)

**ఎమ్మిగనూరుటౌన్, మేజర్‌న్యూస్ :** ఖరీప్ సీజన్ రైతులకు ఆరంభం అవుతున్న నేపధ్యంలో ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకాలకు సాగునీరు అందించడానికి వీలుకాదని , పథకాల మరమ్మత్తులు చెయ్యించాలని ఇటీవల రాష్ట్ర వైకాపా రైతు విభాగం ప్రతినిధి ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు వైకాపా ఇంచార్జ్ బుట్టా రే ణుక ఆదేశాల మేరకు జిఆర్‌పి కార్యలయంను రైతులతో ముట్టడించారు.ఈ నేపధ్యంలో విడుదలైన నిధులకు టెండర్లు ఆహ్వానంపై గడ్డం నారాయణ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఓ ప్రకటన విడుదల చేస్తూ దర్నా చేపట్టిన రోజున అందుబాటులో లేని జిఆర్‌పి అధికారులు జిఆర్‌పి మరమ్మత్తుల నివేదికను రూపొందించి రెండు రోజుల్లో టెండర్లు పిలుస్తాం అని చరవాణి లో మాటిచ్చారని వెల్లడించారు. ఆ మాట ప్రకారం జిఆర్‌పి పనులు సాగేం దకు చర్యలు చేపట్టి ప్రభుత్వ విడుదల చేసిన నిధులను దుర్వినియోగం చెయ్యకుండా పనుల్లో నాణ్యత చూపుతూ ఈ నెలకరు నాటికి సాగునీరు అందించేలా పనులు పూర్తి చెయ్యాలన్నారు. అలసత్వం వహిస్తే ఖరీఫ్ రైతులు నష్టాలు చూస్తారన్నారు. ఒక్కో ఎత్తిపోత పథకానిక దాదావు 3.20 కోట్ల నిధులు కేటాయించడం జరిగిందన్నారు. రైతుల పట్ల పోరాటాలు చెయ్యడానికి వైకాపా ఎప్పటికి సిద్దంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా రైతులు కూడా జిఆర్‌పి అధికారులు వేగవంతంగా టెండర్ల ప్రక్రియ తీసుకొని రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ..అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన డిఐపిఆర్వో


కలెక్టర్‌ని మర్యాదపూర్వకం కలిసి పూలమొక్కను అందజేస్తున్న డీఐపిఆర్వో పురుషోత్తం

**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్ :** జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సిహెచ్ పురుషోత్తం బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియాను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈసందర్భంగా జిల్లాలో బాధ్యతలు స్వీకరించిన డిఐపిఆర్వోకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలు, అధికార కార్యక్రమాలను మీడియా ద్వారా మరింత విస్తృతం చేస్తూ సమాచార శాఖ ప్రతిష్ట పెంచేందుకు కృషి చేయాలని కోరారు.

# కౌలు కార్డులు, మినీ కిట్లు పంపిణీ


కౌలుదారులకు కార్డులను పంపిణీ చేస్తున్న దృశ్యం

**వెలుగోడు, మేజర్‌న్యూస్ :** కౌలు కార్డులు, మినీ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని, పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండలంలోని బోయరేవులు, వెలుగోడు పట్టణం గ్రామాలలో కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి స్వాతి, వెంటనరీ ఏడీహెచ్ వెంకటేశ్వర్లు రైతులతో మాట్లాడుతూ కౌలు కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. అలాగే వరి వేసుకునే రైతులకు విత్తన శుద్ధి చేసుకోవాలని సుడోమోనాస్ అనే బయోఫంగీసైడ్‌తో విత్తన శుద్ధి చేసుకోవాలని, సల్ఫర్ ఉండే ఎరువుల వాడకంను వరి పంటకు తగ్గించాలని దీని వల్ల మొక్క వేరు వ్యవస్థ దెబ్బతిని పెరుగుదల ఉండదని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# 60 ఏళ్ళు పైబడిన వారికి ఇంటివద్దనే రేషన్ అందించాలి

**-మండల తహాశీల్దార్ వెంకటలక్ష్మీ**



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న మండల తహాశీల్దార్ వెంకటలక్ష్మీ

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** సి.బెళగల్ మండలం తహాశీల్దార్ కార్యాలయంలో బుధవారం విఆర్ఓలు రేషన్ డీలర్లతో సిఎస్.డిటీ నవీన్ ఆధ్వర్యంలో తహాశీల్దార్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం నిద్దేశించి తహాశీల్దార్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అరవై ఏండ్లు పైబడిన వారికి రేషన్ ఇంటి వద్దకే అందించాలని సూచించారు.ఈ విషయంపై డీలర్లు అలసత్వం వీడి ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారుల సూచన మేరకు తప్పక పాటించాలని లేని పక్షంలో వేటు తప్పదని డీ లర్లను నుద్దేశించి మాట్లాడారు. రేషన్ సక్రమంగా పంపిణికి వీఆర్ఓ దృష్టి పెట్టి కీలకంగా వ్యవహారించాలని సూచించారు.మండల తహాశీల్దార్ వెంకటలక్ష్మి, డిప్యూటీ తహాశీల్దార్ పురుషోత్తమ్ముడు,సిఎస్ డిటీ. నవీన్,ఏఎస్ఓ. ఆదినారాయణ,ఆర్ఐతరుణ్,వీఆర్ఓలు,తదితరడీలర్లు పాల్గొన్నారు.

# స్పష్టమైన జాబ్‌చార్ట్ ఇచ్చి బదిలీలు చేపట్టాలి



ఎంపీడీఓకు వినతి పత్రం ను అందజేస్తున్న దృశ్యం

**చాగలమర్రి,మేజర్ న్యూస్ :** గ్రామ, వార్డు సచివాలయాల అన్ని శాఖల ఉద్యోగులకు పదోన్న తుల చానెల్ కల్పించి,స్పష్టమైన జాబ్‌చార్ట్ ఇచ్చి సర్వీస్ నిబంధనలు అమలు చేసిన తరువాతనే బదిలీలు చేపట్టాలని సచివాలయ ఉద్యోగులు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్‌కు బుధవారం వినతి పత్రం అందజేసారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బదిలీల ప్రక్రియ సీనియారిటి,మెరిట్ జాబితా విడుదల చేసి పారదర్శకంగా జరిగేలా చూడాలన్నారు. సచివాలయ ఉద్యోగులకు రావలసిన నోషనల్ ఇంక్రిమెంట్లు,పెండింగఅరియర్స్ వెంటనే చెల్లించాలన్నారు. రేషనలైజేషన్ ప్రక్రియ ద్వారా ఏర్పడిన మిగులు సిబ్బందిని ప్రభుత్వం ఏవిధంగా వినియోగించుకుంటుందో స్పష్టత ఇవ్వాలన్నారు.బదిలీ ఉద్యోగులు సొంత మండలాల్లో పని చేసుకునే అవకాశం కల్పించాలన్నారు.

# ఇంటర్మీడియట్‌లో అధిక మార్కులు సాధించిన వెన్నెల

**విద్యార్థిని తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలిపిన విట్ యూనివర్సిటీ**



జి .వెన్నెల

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ పట్టణంలోని వైపిపిఎం జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని జి. వెన్నెల ఈ ఏడాది ఇంటర్మీడియట్ పరీక్షల్లో( ఎంపీసీ) 976/1000 మార్కులు సాధించి నంద్యాల జిల్లాలో ఉన్న 23 జూనియర్ కళాశాలలో ప్రథమస్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఘన విజయం సాధించిన విద్యార్థిని తల్లిదండ్రులకు విట్ యూనివర్సిటీ అమరావతి యాజమాన్యం ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలియజేశారు. విట్ యూనివర్సిటీ అమరావతి నందు ఉచితంగా బీటెక్ కోర్స్ చదువుకోవడానికి సీటు మంజూరు చేశామని తెలియజేశారు. ఈ ఘన విజయాన్ని సాధించిన మా కళాశాల ఆణిముత్యము వెన్నెలకు ఎద్దుల పాపమ్మ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపక మరియు అధ్యాపకేతర బృందం తమ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వెన్నెల మాట్లాడుతూ ఎద్దుల పాపమ్మ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపక బృందం కృషి వల్లనే తనకు ఈ అరుదైన అవకాశం దక్కినట్టు తన సంతోషాన్ని వెలిబుచ్చింది. గత సంవత్సరము కూడా ఇదే కళాశాల నుంచి నంద్యాల జిల్లాలో ప్రథమ స్థానంలో మార్కులు సాధించిన బి.గురుదేవి అనే విద్యార్థిని కూడా విట్ అమరావతి యూనివర్సిటీలో ప్రస్తుతం బీటెక్ మొదటి సంవత్సరము చదువుతున్నది. మా కళాశాల నుంచి వరుసగా రెండు సంవత్సరాలు విద్యార్థులు నంద్యాల జిల్లా ప్రథమ స్థానంలో నిలిచి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకున్నందుకు ఇది తమకెంతో గర్వకారణమని ప్రిన్సిపల్, అధ్యాపక మరియు అధ్యాపకేతర బృందం తెలియజేశారు. ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన ఉచిత విద్య, ఉచిత టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్, పోటీ పరీక్షలకు అవసరమైన మెటీరియల్, రికార్డు బుక్స్ మరియు డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకం అందుబాటులో ఉన్నాయని విద్యార్థులు, తల్లిదండ్రులు ఇది గమనించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రైవేట్ స్కూళ్లలో అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలి

◆ **డీఈవోకి ఎస్ఎఫ్ఐ నాయకుల విన్నపం**




డీఈవోకి వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

**ఆదోని టౌన్, మేజర్ న్యూస్:** 'నాణ్యమైన విద్యనుఅందిస్తామంటూ.. పేద విద్యార్థులు వారి తల్లిదండ్రుల నుంచి ముక్కు పిండి మరీ అధిక ఫీజులను వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లపై వెంటనే చర్యలు తీసుకోవాలి' అని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో పాఠ్యపుస్తకాలు, బెల్ట్, టైల పేరుతో వ్యాపారం చేస్తున్న విద్యాసంస్థల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలంటే ఆదోని డివిజన్ వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఆర్టీఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

# వైయస్.జగన్ పై కేసు పెట్టడం సరికాదు..

**వైసీపీ ఎస్సీ సెల్ నాయకులు జనార్ధన్**



**తుగ్గలి,మేజర్ న్యూస్ :**రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైసీపీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి పై ప్రభుత్వము కేసు పెట్టడం సరైనది కాదని, వైసిపి ఎస్సి సెల్ నాయకులు, మాజీ సర్పంచ్ పగిడిరాయి జనార్ధన అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుకుండ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి పై కేసులు పెట్టడం మంచి పద్ధతి కాదన్నారు. గతంలో మాజీ ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు గతంలో చాలా సంఘటనలు జరిగిన అప్పుడు ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఏనాడు చంద్రబాబు మీద కేసు పెట్టలేదు అన్నారు. ఏదైనా ఉంటే రాజకీయంగా చూడాలి కానీ వ్యక్తిగతంగా కేసులు పెట్టడం సరికాదన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి జెడ్ ప్లస్ సెక్యూరిటీగా ఉన్న పోలీసులు మాత్రం ఆయనకు రక్షణ కవచంగా ఉండకపోవడం విచారకరమన్నారు ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వైయస్ జగన్మోహన్ రెడ్డికి భద్రత పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.

# అబ్దుల్‌కలాం నేషనల్ అవార్డును అందుకున్న ఖాజాబేగ్




అవార్డుతో ఖాజాబేగ్‌ను సత్కరించిన వరల్డ్ చారిటీ ట్రస్ట్ సంస్థ ప్రతినిధులు

**వెల్దుర్తి, మేజర్‌న్యూస్:** కర్నూలు జిల్లా, పత్తికొండ నియోజకవర్గం, వెల్దుర్తికి చెందిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహిత, సామాజికవేత్త ఖాజాబేగ్ అబ్దుల్‌కలాం నేషనల్ అవార్డును హైదరాబాద్‌కు చెందిన వరల్డ్‌చారిటీ ట్రస్ట్ అనే స్వచ్ఛంద సంస్థ అందజేశారు. ఈ సందర్భంగా బుధవారం ఖాజాబేగ్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ వృత్తిని దైవంగా భావిస్తానని, సమాజానికి నాకు చేతనైనంత సేవ చేస్తానన్నారు. అబ్దుల్‌కలాం అంతర్జాతీయ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని, ఎంతో బాధ్యతతో, చిత్తశుద్ధితో మరింత కృషి చేస్తానని, తనను ఈ అవార్డుకు ఎన్నుకున్న వరల్డ్‌చారిటీట్రస్ట్ వారికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఎంతోమంది నిరుపేద విద్యార్థినీ, విద్యార్థులను తన ఉత్తమ బోధనతో ఉన్నతంగా తీర్చిదిద్దుతూ వారిలో వ్యక్తిత్వ వికాసానికి కూడా పాటుపడుతూ, ఎన్నో సేవా కార్యక్రమాలు, రక్తదానాన్ని చేస్తూ సమాజంలో ఎంతో చైతన్యం తీసుకువస్తున్న ఖాజాబేగ్‌కు ఈ అవార్డు రావడం కర్నూలు జిల్లాకు ఎంతో గర్వకారణమని వెల్దుర్తి హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ అధ్యక్షులు హరిసింహనాయుడు అన్నారు.

# డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనాన్ని ఆకస్మికంగా సబ్ కలెక్టర్ తనిఖీ

**– విద్యార్థులతో కలిసి భోజనం చేసిన సబ్ కలెక్టర్**



భోజనాన్ని తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్, డిఈఓ

**ఆదోని, మేజర్ న్యూస్ :** ఆదోని నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ హైస్కూలులో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని బుధవారం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిఈఓ శామ్యూల్ పాల్ వారితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న భోజన నాణ్యతను ప్రత్యక్షంగా పరిశీలించిన అనంతరం అక్కడే విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంపై సామాజిక మాధ్యమంలో వస్తున్న వార్తలను చూసి క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా విద్యార్థుల హాజరు పట్టిక, భోజనానికి సంబంధించిన రికార్డు తనిఖీ చేసి విద్యార్థులతో ప్రభుత్వం అందిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని గురించి చర్చించారు. ఏదైనా సమస్యలు ఉన్నాయా, విద్యార్థులకు శుభ్రమైన పోషకాహారంతో కూడిన భోజనం అందించాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని ప్రతి పాఠశాల పాటించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఈఓ శామ్యూల్ పాల్, డిప్యూటీ డిఈఓ వెంకట రమణారెడ్డి, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ వసతిగృహాల్లో సీట్లు, వసతులు పెంచండి

**హెల్పింగ్‌హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు హరిసింహనాయుడు**



సమావేశంలో మాట్లాడుతున్న హరిసింహనాయుడు

**వెల్దుర్తి రూరల్, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ వసతిగృహాల్లో సీట్లు, పెంచి విద్యార్థులకు వసతులు పెంచాలని హెల్పింగ్‌హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు హరిసింహనాయుడు అన్నారు. ఈ సందర్భంగా వెల్దుర్తి ప్రభుత్వ బాలికల వసతి గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హరిసింహనాయుడు మాట్లాడుతూ బాలికల విద్య మీద ప్రజల్లో అవగాహన పెరిగి తల్లిదండ్రులు తమ పిల్లలను చక్కగా చదివించుకోవాలని వసతి గృహాల్లో చేర్పించుకోవడానికి వస్తే వారికి సీట్లు లేవని తెలిసి ఎంతో వేదనకు గురౌతున్నారన్నారు. ఆడపిల్లలను పల్లెటూర్ల నుండి తిప్పి చదివించుకోలేమని, వెల్దుర్తి బాలికల వసతిగృహంలో వసతి గృహాధికారిణి శైలజ చేసిన కృషి వల్ల విద్యార్థినీల్లో చక్కని క్రమశిక్షణ, చదువులు వస్తున్నాయని మండలంలోని వివిధ ప్రాంతాల నుండి వెల్దుర్తి ప్రభుత్వ బాలికల వసతి గృహంలో తమ పిల్లల్ని చేర్చుకోవడానికి వస్తే ప్రభుత్వ వసతిగృహంలో సీట్లు సరిపోయినన్ని లేవని తెలుస్తోందని, బాలికల వసతి గృహాన్ని ప్రభుత్వం వెంటనే ఇప్పుడున్న సీట్లు కాక కనీసం 500 సీట్లు కేటాయిస్తూ బీసి బాలికల వసతి గృహాన్ని విస్తరించాలని రైతులు, రైతుల కూలీల నిరుపేద విద్యార్థినీలు చదువుకునే అవకాశం కల్పించాలని పలువురు ప్రజలు, ప్రజాసంఘాలు మరీ ముఖ్యంగా రైతులు, రైతు కూలీలు కోరుకుంటున్నారు.

# శ్రీ మఠంలో వేద వర్ధన తీర్థులు



**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం కర్ణాటక రాష్ట్రంలోని ఉడిపి శ్రీరూర్ మఠం పీఠాధిపతి శ్రీ వేద వర్ధన తీర్థులు మంత్రాలయంకు విచ్చేశారు. ఆయనకు శ్రీ మఠం సిబ్బంది పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. వేద వర్ధన తీర్థులు గ్రామ దేవత మంచాలమ్మను దర్శించి,రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పండిట్ కేసరి రాష్ట్రపతి అవార్డు గ్రహిత శ్రీ రాజా ఎస్ గిరిజాచార్యులు, ఆలయ సంప్రదాయాల ప్రకారం వేద వర్ధన తీర్థులను ఫలమంత్రాక్షితలు ఇచ్చి సన్మానించారు.

## ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ పట్టణం లోని విశ్వరూప నగర్ మండల ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. పాఠశాలలోని 50 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ దాతల సహకారంతో అందజేయడం జరిగిందని ఇన్నర్ వీల్ క్లబ్ ప్రెసిడెంట్ ఉషారాణి తెలిపారు. ఆళ్లగడ్డకు చెందిన వ్యాపారవేత్త నిచ్చెన మెట్ల రామయ్య, అనసూయ దంపతులు వారి మనవడు అద్వైత్ పేరిట స్టడీమెటీరియల్ పంపిణీకి ఆర్థిక సహకారం అందజేశామన్నారు. ఈసందర్భంగా దాతకుటుంబ సభ్యులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, సునీల్, ఇన్నర్ వీల్ సభ్యులు గాయత్రి, రాధ, కవిత, సరోజ, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలి

**జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ**




**పాములపాడు మేజర్ న్యూస్ :** రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి మురళి కృష్ణ అన్నారు బుధవారం మండల పరిధిలోని గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు మట్టి పరీక్ష ఫలితాలను రైతులు వినియోగించుకొని ఎరువులు వాడకం తగ్గించుకోవాలని సూచించారు. సేంద్రియ వ్యవసాయంపై రైతులు శ్రద్ధ వహిస్తే మంచి ఫలితాలు ఉంటాయని గుర్తు చేశారు కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందాలని సూచించారు. పంట బీమా పథకం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఆత్మకూరు డివిజన్ వ్యవసాయ అధికారి ఆంజనేయ,మండల వ్యవసాయ అధికారి మహేశ్వర్ రెడ్డి, ఆ గ్రామ సర్పంచ్ కోట్ల చంద్రారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలు వద్దు- ఉజ్వల భవిష్యత్తు ముద్దు

**- మాదకద్రవ్యాలు-దుష్ప్రభావాల పై అవగాహన - ఎక్సైస్ సీఐ ఎస్.ఆర్. నాయక్**




**నందికొట్కూరు రూరల్ మేజర్ న్యూస్ :** మాదకద్రవ్యాలు వద్దు–ఉజ్వల భవిష్యత్తు ముద్దు అని నందికొట్కూరు ఎక్సైజ్ శాఖ ఎస్. ఆర్.. నాయక్ విద్యార్థులకు సూచించారు. బుధవారం పట్టణంలోని స్థానిక శ్రీ నంది జూనియర్ కళాశాలలో నంద్యాల జిల్లా ఎక్సైజ్అధికారి ఎస్.రవికుమార్ ఆదేశాల మేరకు అంతర్జాతీయ మాదకద్రవ్యాలు నిరోధక దినోత్సవం జూన్ 26 సందర్భంగావిద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం నాడీ మండల వ్యవస్థ మీద నార్కోటిక్ డ్రగ్స్ చూపించేప్రభావాలు,మాదకద్రవ్యాలు సేవించడం అలవాటు అయితే కలిగే దుష్ప్రభావాలు, మాదకద్రవ్యాలు కలిగి ఉండటం, సేవించడం వలన చట్టపరమైన చర్యలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్, నందికొట్కూరు ఎక్సైజ్ సిబ్బంది వెంకటేశ్, శ్వేతా రాణి తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిపై ఇనుప పారతో దాడి.. కేసు నమోదు

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని వేముగోడు గ్రామంలో పోలం యజమాని రాముడి పై దస్తగిరి అనే వ్యక్తి ఇనుప గడ్డపారతో తల పై దాడి చేయడంతో రాముడికి తీవ్ర రక్త గాయాలయ్యాయని సీఐ విజయభాస్కర్ తెలిపారు. పోలీసులు అందించిన సమాచారం మేరకు రాజోలి రాముడు అనే వ్యక్తి తన పొలంను ఆదే గ్రామానికి చెందిన బలిజ రంగయ్య అనే రైతుకు కౌలుకు ఇచ్చాడు. అయితే రాజోలి రాముడు కౌలుకు ఇచ్చిన పొలం గట్లపై దస్తగిరి అనే వ్యక్తి ఎరువు మట్టిని వేశాడు. దీంతో దస్తగిరి కి తను కౌలుకు ఇచ్చిన పొలం గట్ల పై వేసిన ఎరువును తీసివేయాలని రాముడు చెప్పాడు. రాముడు చెప్పిన చాల రోజుల తరువాత ఎరువును తీసిసేందుకు పొలం దగ్గరకు దస్తగిరి వచ్చాడు. అదే సమయంలో రాముడు అక్కడికి వచ్చి ఇన్ని రోజులు ఎందుకు ఎరువును నా పొలం దగ్గర పెట్టావు అన్ని ప్రశ్నించాడు. దీంతో ఆగ్రహానికి లోనైన దస్తగిరి తన చేతిలో ఉన్న ఇనుపగడ్డపారతో రాజోలి రాముడి తలపై కొట్టాడు. దీంతో తలక తీవ్రగాయం కావడంతో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు రాముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసు న్నట్లు పోలీసులు తెలిపారు.

## సమ్మర్ స్టోరేజి ట్యాంక్ నిర్మాణం పనులను పరిశీలించిన డిఇ

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** సి.బెళగల్ మండలంలో తిమ్మందొడ్డి గ్రామానికి సంబంధించిన సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ పనులను బుధవారం ఆర్డబ్లివ్ఎస్ డిఇ.జి.శ్రీనివాసులు,ఏఇ గోనెనాయక్తో కలసి పరిశీలించారు.మండల పరిధిలోని తిమ్మందొడ్డి గ్రామానికి త్రాగునీటి కష్టాలను తీర్చేందుకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించేందుకు గ్రామానికి సమీపంలో తుంగభద్ర నది ఒడ్డున రూ. 28.44లక్షల వ్యయం తో నిర్మిస్తున్న సమ్మర్ స్టోరేజి పనులను మండల ఆర్డబ్లీవ్ఎస్ ఏఇ.గోనెనాయక్ తో కలసి పరిశీలించారు. అనంతరం అయన మాట్లాడుతూ ట్యాంక్ పనులు నాణ్యతలో రాజీపడకుండా పూర్తి నాణ్యతతో నిర్మిచాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు ఆదేశించారు.ఈ సందర్బంలో ఆర్డబ్లీవ్ఎస్.డిఇ,ఏఇ, సూర్య చంద్ర,కాంట్రాక్టర్ తదితరులు వున్నారు.

# భూసార పరీక్ష పత్రాలు పంపిణీ

**పంపిణీచేసిన మండల వ్యవసాయ అధికారి**

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** సి.బెళగల్ మండలం గుండ్రేవుల గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని బుధవారం మండల అధికారి జి. మల్లేష్ కుమార్ నిర్వహించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులకు భూసార పరీక్ష పత్రాలను అందించారు. భూసార పరీక్ష నమూనాల్లో చూయించిన ప్రమాణాల ప్రకారం రైతు సోదరులు ఎరువులు తగిన మోతాదుల్లో సూక్ష్మ పోషకాలు మరియు నత్రజని, భాస్వరం, పొటాష్ భూసారపరీక్ష


పత్రాలను రైతులకు అందిస్తున్న ఏఓ మల్లేష్ కుమార్

పత్రాల ఆధారంగా వినియోగించుకోవాలని తెలియజేశారు. గుండ్రేవుల ఎనగండ్ల గ్రామాలకు సంబంధించి 1233 మంది రైతు కుటుంబాలకు అన్నదాత సుఖీభవ పథకం మంజూరైయిందని ఇప్పటివరకు 1214 మంది ఈకేవైసీ వేలిముద్రలు పూర్తి చేయడమైనదని,అదేవిధంగా మండలంలో 10229 మంది రైతుల కుటుంబాలకు అన్నదాత సుఖీభవ పథకం మంజూరైయిందని, ఇప్పటివరకు10064 మంది రైతులు ఈకేవైసీ పూర్తి చేయడమైనది. ఈనెల చివరి వరకు ఈకేవైసి పూర్తి చేసుకోవాల్సిందిగా వ్యవసాయ అధికారి తెలియజేశారు. అదే విధంగా రైతులకు జీలుగా,విత్తనాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది ఎంపీఈఓలు సోమేశ్వరి మరియు ఈశ్వర్ రైతులు పాల్గొనడం జరిగినది.

## పేదల ఆరోగ్యం పట్ల పెద్ద మనస్సును చాటుకుంటున్న సీఎం చంద్రబాబు

- **మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు**
- **సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 32మంది లబ్దిదారులకు రూ. 15 లక్షల చెక్కులు అందజేత**

**ఆదోని టౌన్, మేజర్ న్యూస్:** రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఉన్నా పేద ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతో సీఎం రిలీఫ్ ఫండ్ కు ఎన్ని అప్లికేషన్లు వచ్చినా వెంటనే మంజూరు చేసి, రాష్ట్ర ప్రజల ఆరోగ్యం పట్ల సీఎం చంద్రబాబు తన పెద్ద మనసును చాటుకుంటున్నారని ఆదోని నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు స్పష్టం చేశారు. బుధవారం ఆయన నివాసంలో అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆస్పత్రులలో చికిత్స పొందిన 32 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ. 15 లక్షలు విలువైన చెక్కులను మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఆదోని నియోజకవర్గంలో ఇప్పటికే వందలాది మంది పేదలకు వైద్య సేవల కోసం సీఎం సహాయనిధి ద్వారా చెక్కులు అందజేసినట్లు చెప్పారు. పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్


లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు

అనేది ఒక వరంలాంటిది దీనిని ఆదోని నియోజకవర్గ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కులమతాలు, పార్టీలకతీతంగా ఆదోని ప్రాంత ప్రజలకు ఎప్పుడు ఏ సమస్య వచ్చినా తనని సంప్రదిస్తే సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి ఆ సమస్యను పరిష్కరించేందుకు తాను కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు స్పష్టం చేశారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

**49 బన్నురులో పొలం పిలుస్తుంది..**

**మిడుతూరు,మేజర్ న్యూస్ :** మిడుతూరు మండల పరిధిలోని 49 బన్నూరులో మండల వ్యవసాయఅధికారి పీరునాయక్ ఆధ్వర్యంలో బుధ వారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏడి ఏ విజయ శేఖర్ హాజరయ్యారు ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ మొక్కజొన్న పంటలో సాగు పద్ధతులుగురించి కత్తెరపురుగు ఆశించకుండా యాజమాన్య పద్ధతులను గురించి రైతులకు వివరించారు పంట లేత దశలో తక్కువ నీళ్లుఉండేటట్లుచూసుకోవాలని అన్నారు. పంట విత్తన 48 గంటల్లోపు అట్రాజిన్ కలుపు మందు 800 గ్రాములు పిచికారి చేయాలి బోదెలు ఎక్కువగా ఉన్నట్లయితే మొక్కలు కింద పడకుండా ఉంటాయి. బోధలు కాలువ పద్ధతిలో అవలంబిస్తే నీటిని ఆదా చేయవచ్చు కలుగును సమర్థంగా నివారించుకోవచ్చు పంటలో పెట్టుబడి తక్కువతో అధిక దిగుబడిని ఇవ్వచ్చని రైతులకు వివరించారు. విత్తనాల



పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

ను ఎంచుకునేటప్పుడు దళాలను నమ్మి మోసపోవద్దని లూజు విత్తనాలను కొనుగోలు చేయవద్దని రైతులకు సూచించారు. ముఖ్యంగా రైతులు 2025లో ఖరీఫ్ పంట నమోదును ఆర్‌బికే కేంద్రంలో నమోదు చేసుకోవాలని ఏవో పీరు నాయక్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ మల్లికార్జున రెడ్డి ఆయా గ్రామాల ఆర్ఎస్కే సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎస్ డీటీని కలిసిన డీలర్లు

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** ఎమ్మిగనూరు నూతన సివిల్ సప్లై డిప్యుటీతహసీల్దార్ చంద్రకళ భాద్యతలు తీసుకున్నారు. బుధవారం పట్టణ రేషన్ డీలర్లు, ఆ సంఘం అధ్యక్షులు సోమల గూడూరు బాషా ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి పూలమాల, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా డీటీ చంద్రకళ మాట్లాడుతూ రైస్ కార్డుదారులు ఎవరైనా ఈకేవైసీ చేయని వారిని పూర్తి చేయాలని, 65 పైబడిన వృద్దులకు, వికలాంగులకు ఇంటి వద్దకే వెళ్లి రేషన్ సరుకులు పంపిణీ చేయాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రేషన్ పంపిణీ సక్రమంగా చేయాలన్నారు. ఈ కార్యక్ర



మంలో రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

## తాడిపత్రి అసెంబ్లీ టిడిపి అబ్జర్వర్ గా మాజీ జడ్పీ ఛైర్మెన్ బత్తిన వెంకటరాముడు

**తుగ్గలి,మేజర్ న్యూస్ :**

అనంతపురం జిల్లా, తాడిపత్రి నియోజకవర్గం టిడిపి అబ్జర్వర్ గా కర్నూలు జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ బత్తిన వెంకటరాముడును టిడిపి అధిష్టానం నియమించడంతో బుధవారం తాడిపత్రి పట్టణంలో టిడిపి మండల, గ్రామ ,పట్టణ కమిటీలు ఎన్నికల నిర్వహించేందుకు తాడిపత్రి కు వెళ్లి ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంపిక



చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బత్తిన వెంకటరాముడు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తాడిపత్రిలో వివిధ టిడిపి అనుబంధ కమిటీలను వేయడం జరుగుతుంది అన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అని ఈ సందర్భంగా కోరారు. టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సూర్య www.suryaa.com



# సిపిఆర్, ప్రథమ చికిత్సల పై పోలీసులకు అవగాహన

## – జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్



పాల్గొన్న పోలీస్ అధికారులు

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** జిల్లా పోలీసులకు బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో సిపిఆర్, ప్రథమ చికిత్సలపై శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో జిల్లా పోలీస్ సిబ్బంది, సిపిఆర్ ప్రథమ చికిత్సపై ఏమి చేయాలి..ఏమి చేయకూడదో తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గుండెపోటు వచ్చినప్పుడు, స్పృహ తప్పి కోల్పోయి నప్పుడు హాస్పిటల్‌కు తీసుకువెళ్లే 1గంటలోపు చేసే సిపిఆర్ విధానంపై పోలీసులచే ప్రాక్టీస్ చేయిస్తున్నా మన్నారు. అనంతరం మెడికవర్ హాస్పిటల్ డాక్టర్ సునీల్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఇంట్లో సిపిఆర్‌పై అవగాహన ఉండడం ముఖ్యమన్నారు. ఏ సమ యంలోనైనా ఉపయోగపడవచ్చన్నారు. పోలీసులు అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు సహాయం చేయడంలో మొదటి ప్రతిస్పందనదారులుగా ఉంటారని కావున వారు సిపిఆర్ ప్రథమ చికిత్సపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ శిక్షణలో బాగా ప్రతిభ కనబరిచిన వారికి సర్టిఫికేట్లు ప్రధానం చేశారు. అలాగే రూ. 8వేలు విలువ గల హెల్త్ చెకప్ మెడికల్ కూపన్స్ పోలీసులకు ఉచితంగా, పోలీసు కుటుంబ సభ్యులకు రూ. 1000లకు అందచేశారు. ఈ కార్యక్రమంలో సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ మహేష్ కుమార్, ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణ మోహన్, మెడికవర్ హాస్పిటల్ డాక్టర్ సునీల్ యాదవ్, పోలీస్ వెల్ఫేర్ హాస్పిటల్ డాక్టర్ స్రవంతి, డిఎస్పీలు బాబు ప్రసాద్, భాస్కర్‌రావు, ప్రసాద్, సిఐలు తేజమూర్తి, మన్సూరుద్దీన్, అబ్దుల్ గౌస్, నాగరాజు రావు, రామానాయుడు ఆర్ఐలు నారాయణ, జావేద్, సోమశేఖర్ నాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మాదకద్రవ్య రహిత సమాజ స్థాపనకు కృషి చేద్దాం : నంద్యాల జిల్లా ఎస్పీ



సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తున ఎస్పీ

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** మాదకద్రవ్య రహిత సమాజాన్ని సాధించుట కొరకు అధికారులు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్వాల దుర్వినియోగం, అక్రమ రవాణా దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జూన్ 26న మాదక ద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా దినోత్సవం నిర్వహించడం జరిగిందని అన్నారు. ఇందు కోసం జిల్లాలో వివిధ కళాశాలలు, పాఠశాలల్లో అధికారులు సమీక్షా సమావేశాన్ని నిర్వహించి ప్రజల సహకారంతో బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశ, నిర్ధేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్ – ఎక్సైజ్ అధికారి రవికుమార్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిటెండెంట్ రాముడు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, ఉమెన్ –చైల్డ్ డైరెక్టర్ లీలావతి, నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణమూర్తి, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌దాస్, తదితరులు పాల్గొన్నారు.

# పురుగుల మందు సేవించి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- బ్యాంకు రుణం ఇప్పిస్తానని వెలుగు ఏపీఎం మోసం
- రూ.70 వేల లంచం అధికారి వసూలు
- ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు



వెలుగు ఐకెపి కార్యాలయం

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** బ్యాంకు రుణం ఇప్పిస్తామని మోసం చేశారంటూ పురుగు మందు తాగి ఆత్మహత్య యత్నం చేసుకున్న సంఘటన బుధవారం చోటు చేసుకొంది. వివరాలు ఇలా ఉన్నాయి. కోసిగి మండలం వందగల్లు గ్రామానికి చెందిన బసవరాజు అనే వ్యక్తి నుంచి విబికె ద్వారా కౌతాళం మండలం వెలుగు ఏపిఎంగా పనిచేస్తున్న సమయంలో ఆ అధికారి రూ. 5లక్షలు బ్యాంకు రుణం ఇప్పిస్తానని చెప్పి రూ. 70వేలు అక్రమంగా లంఛం తీసుకున్నారు. బ్యాంకు రుణం ఇప్పటివరకు ఇప్పించకపోవడంతో మనోవేదన గుర్తైన బసవరాజ్ మంత్రాలయం మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయం ముందు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అక్కడే ఉన్న ఐకెపి సిబ్బంది మెరుగైన చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బసవ ఆరోగ్యం నిలకడ ఉందని తెలిసింది. ఆ వ్యక్తికి ప్రాణపాయ స్థితి తప్పడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం ఆ అధికారి మంత్రాలయం మండల వెలుగు ఏపీఎం విధులు నిర్వహిస్తున్నారు. ఈ విష యం పై మంత్రాలయం రూరల్ మేజర్ న్యూస్ మంత్రా లయం వెలుగు ఏపిఎం రాజశేఖర్‌ను ఫోన్‌లో వివరణ కోరగా, సమాదానం ఇవ్వలేదు.

# సూర్య వార్తకు స్పందించిన గ్రామ సర్పంచ్

## డ్రైనేజీకాలువలోచెత్త చెదారాన్ని తొలగించిన పంచాయతీ సిబ్బంది



**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** పెద్దకడుబూరు మండల కేంద్రంలో చెత్త చెదారం.. చిత్త శుద్ధి లేని అధికారులు అనే వార్త నేటి దినపత్రిక సూర్య దినపత్రిక లో బుధవారం ప్రచురణ కావడంతో వెంటనే స్పందించిన గ్రామ సర్పంచ్ మాలరామాంజినేయులు గ్రామంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న డ్రైనేజీలో పేరుకొనిపోయిన పూడికను చెత్త చెదారంను తొలగించిడం జరిగింది. అలాగే కురవ వీధిలోను ఎస్సీ కాలనీ కి వెళ్ళే ప్రధాన రహదారిపై అంబేద్కర్ విగ్రహం దగ్గర ఉన్న డ్రైనేజీ లో కూడ పూడికను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని అయా కాలనీ వాసులు సర్పంచ్ ను కోరారు. దీనికి పారిశుద్ధ్య పనులలో ఎలాంటి లోపం లేకుండా చేస్తామని సర్పంచ్ ప్రజలకు హామీ ఇచ్చారు.

# గ్రామీణ ప్రతినిధుల సమస్యలకు పరిష్కారం చూపండి

- ఉపాధిహామీ నిధులు అందించి ఆదుకోండి
- ముఖ్యమంత్రి చంద్రబాబుకు బిర్రు ప్రతాప్‌రెడ్డి విన్నపాలు



సిఎం చంద్రబాబును కలిసిన బిర్రు ప్రతాప్‌రెడ్డి

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రతినిధుల సమస్యలను తీర్చాలని ఏపి పంచాయితీ రాజ్ చాంబర్ ప్రదాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును రాష్ట్ర సచివాలయంలో కలి శారు. బుదవారం రాష్ట్ర పంచా యితీ రాజ్ ఛాంబర్ అధ్యక్షులు వైవిబి రాజేంద్రప్రసాద్ ఆదేశాల మేరకు స్థానిక పరిపాలన సంఘం నాయకులుగా ఆయన వారు ఎదుర్కోంటున్న సమస్యలను వివరించారు. సర్పంచ్ లను మొదలుకుని ఎంపిటిసి, ఎంపిపి, జెడ్‌పిటిసి,జెడ్‌పిపిలకు విడుదల అయ్యే నిధులు, విధులు, అధికారాలను సక్రమంగా అమలు అయ్యే విధంగా చెయ్యాలని విన్నవించారు. రాష్ట్రంలో 13 వేల గ్రామపంచాయతీలలో నివసిస్తున్న ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రతినిధులు చాలా ఇబ్బందులు పడుతున్న నేపద్యంలో వారికి నిధులు అందించి , విధుల పట్ల చిత్తశుద్ధి కలిగేలా చూడాలన్నారు. అలాగే వారి అధికారాలను వారే వినియోగించుకునేలా చూడాలన్నారు. ప్రతినిధి ఒకరు అయితే పెత్తనం మరొకరిది కాకుండా గట్టి చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే జాతీయ ఉపాధి హామీ పథకంలోని నిధులతో పనులు చేపడుతున్న వారికి నిధులు విడుదల చేయించాలని విజ్ఞప్తి చేశారు. వీటిపై స్పందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రతి సమస్యకు పరిశీలించి వాటి పరిష్కారానికి కృషి చెయ్యడం జరుగుతుందని హామీ ఇచ్చిరని బిర్రు ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

# డప్పు కళాకారుల పెన్షన్‌ను రూ.7వేలకు పెంచాలి



**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** ఆదిమ సాంప్రదాయ కళాకారులైన డప్పు కళాకారుల పెన్షన్‌ను రూ. 7వేలకు పెంచాలని ఏపి డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు యండి ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని ఎన్ కొంతలపాడు గ్రామంలో 100డప్పులతో ప్రభుత్వ స్కూల్ నుండి గ్రామం మొత్తం డప్పుల దరువులతో ప్రదర్శన నిర్వహించి ఎస్‌సి కాలనీ వద్ద ఏర్పాటు చేసిన కెవిపిఎస్, ఏపిడికేయస్ నూతన ఫోల్‌కు ఏపిడికెయస్‌జిల్లా కార్యదర్శి కరుణాకర్ పతాకాన్ని ఎగురవేశారు. ఏపిడికెయస్ జిల్లా అధ్యక్షులు జె మద్దిలేటి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానుద్దేశించి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు యండి ఆనంద్ బాబు, జిల్లా కార్యదర్శి కరుణాకర్, వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి జి నాగన్నలు మాట్లాడుతూ డప్పు, చర్మకారుల పెన్షన్ ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలన్నారు. దరఖాస్తు వయసు 45సం॥లకు తగ్గించడంతో పాటు పెన్షన్‌ను రూ. 7వేలకు పెంచాలన్నారు. డప్పు కళాకారుల అన్ని రకాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నేటి నుండి జూలై 1వరకు సచివాలయాల్లో అర్జీలు ఇవ్వాలని, జూలై 2న కర్నూలులో జిల్లా కమిటీ నిర్వహించుకుని భవిష్యత్తు కార్యచరణ రూపొందించుకుని నిర్వహించబోయే పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి పెద్దబాబు, మండల కార్యదర్శి గుట్టపాడు రామకృష్ణ, ఏపిడికెయస్ జిల్లా ఉపాధ్యక్షులు చిన్న మారయ్య, జె వెంకటేశ్వర్లు, జిల్లా సహాయ కార్యదర్శులు గురిగింజ నాగరాజు, మల్లెపోగు దస్తగిరి, జిల్లా కమిటీ సభ్యులు మధు, బైరాపురం కృష్ణ, మంద మాదన్న, మండల నాయకులు మద్దిలేటి, సురేష్, రామాంజనేయులు, డప్పు కళాకారులు పాల్గొన్నారు.

# మంత్రిని కలిసిన మాజీ ఎమ్మెల్యే భూమా



మంత్రితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి

**నంద్యాల నూనెపల్లె , మేజర్‌న్యూస్ :** రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను మర్యాదపూర్వకంగా కలిసినట్లు మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి తెలిపారు. బుదవారం మంత్రి ఫరూక్‌ను టీడీపీ కార్యాలయం (రాజ్ టాకీస్ ) నందు మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు పలు రాజకీయ అంశాలపై చర్చించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఫ్లోర్ లీడర్ మహాబూబ్ వలి, చింతకుంట్ల విశ్వనాథ్‌రెడి, తదితరులు పాల్గొన్నారు.